


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
J V NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -110 శనివారం 3 అక్టోబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -8 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా

# అల్పాహార పథకం

**పాఠశాలల్లో అల్పాహార పథకం.. సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు**

**సెంట్రలైజ్డ్ కిచెన్ల ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌తో ఒప్పందాలు**

**నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లలో వంటశాలల కోసం ముందుకొచ్చిన ప్రైవేటు సంస్థలు**

**నవంబర్ 30 కల్లా ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎం రేవంత్ ఆదేశం**

**ఆహార నాణ్యత కు కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయాలని సూచన**




**హైదారాబాద్, అక్టోబర్ 02 (జర్నలిస్ట్ వార్త):**
ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం అమలు చేయనున్న అల్పాహార పథకం ఏర్పాట్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేగవంతం చేశారు. డిసెంబర్ 9వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని ప్రారంభించేందుకు వీలుగా నవంబర్ 30 నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ పథకంలో భాగంగా సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు సంబంధించిన ఒప్పందాలు నేడు ముఖ్యమంత్రి సమక్షంలో జరిగాయి.
జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో, అత్యాధునిక వంటశాలల ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌కు మిగతాది 2లో...

# హాకీలో స్వర్ణం

**44 ఏళ్ల నిరీక్షణకు తెరదించిన మహిళల హాకీ టీమ్**

**ఆసియా గేమ్స్ మహిళల హాకీలో భారత్‌కు స్వర్ణ పతకం**

**ఫైనల్లో చైనాపై 1-0 తేడాతో ఉత్కంఠభరిత విజయం**

**2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించిన భారత్**




**అక్టోబర్ 02 (జర్నలిస్ట్ వార్త):**
భారత మహిళల హాకీ జట్టు అద్భుతం చేసింది. ఏళ్ల తరబడి ఊరిస్తున్న ఆసియా గేమ్స్ స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. ఏకంగా 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ శుక్రవారం జరిగిన ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ చైనాను ఓడించి పసిడి పతకాన్ని ముద్దాడింది. ఈ చారిత్రాత్మక విజయంతో భారత క్రీడా ప్రపంచంలో సంబరాలు అంబరాన్నంటాయి. అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత జట్టు 1-0 తేడాతో చైనాపై గెలుపొందింది. ఆట తొలి క్వార్టర్‌లోనే లాల్‌రెమ్‌సియామి హ్మార్జోతే అద్భుతమైన ఫీల్డ్ గోల్ చేసి భారత్‌కు ఆధిక్యాన్ని అందించింది. మిగతాది 2లో...

# గాడ్సే భావజాలాన్ని తిప్పికొట్టాలి

**గాంధీ ఆశయాల స్ఫూర్తితోనే మా పాలన**

**ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**

**గాంధీ భవన్‌లో గాంధీ జయంతి వేడుకలు**

**హైదారాబాద్, అక్టోబర్ 02(ఆర్ఎన్ఏ):**



**హైదారాబాద్, అక్టోబర్ 02 (జర్నలిస్ట్ వార్త):**
గాంధీ జయంతిని పురస్కరించుకుని జాతిపిత మహాత్మా గాంధీకి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఘన నివాళు లర్పించారు. గాంధీజీ ఆశయాల స్ఫూర్తితోనే రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, వివక్ష లేని సమాజ నిర్మాణమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. గాడ్సే భావజాలాన్ని వ్యాప్తి చేస్తూ, స్వాతంత్ర్య ఉద్యమ మిగతాది 2లో...

# మీరు నా ఆరాధ్య దైవం

**మోదీతో అంటూ స్మిత్ భావోద్వేగం**

**ఫ్లైదుబాయ్ హీరో పైలట్ స్మిత్ మచ్చర్‌కు ఫోన్ చేసిన ప్రధాని మోదీ**

**స్మిత్ ధైర్యసాహసాలను కొనియాడి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష**

**దాడి సమయంలో హనుమాన్ చాలీసా పఠించానని ప్రధానికి వివరించిన పైలట్**

**వైద్య సహాయంతో పాటు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చిన ప్రధాని**

2లో.



# కరవుసీమ ఇకపై కనకసీమ



**మదనపల్లెలో "గ్లోబల్ హార్టికల్చర్ హబ్ - ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్" శంకుస్థాపన**

**సాగునీరు అందిస్తే సీమ రైతులు బంగారం పండిస్తారన్న చంద్రబాబు**

**మూడేళ్లలో 36 ప్రాజెక్టులు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని వ్యాఖ్య**

**మదనపల్లె (జర్నలిస్ట్ వార్త):**
కరవుపీడిత రాయలసీమ తలరాతను, రూపురేఖలను మార్చేందుకు గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌ను తీసుకొచ్చామని, ఈ ప్రాంతాన్ని ఫ్రూట్ బౌల్‌గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. 2లో...






# కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి హరీశ్ రావు లేఖ

**టీజీ ట్రాన్స్‌కోలో 26 శాతం వాటాల విక్రయాన్ని ఆపాలని వినతి**

**ఇది విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు తొలి అడుగని ఆందోళన**

**కాంగ్రెస్ జాతీయ విధానాలకు ఇది విరుద్ధమని లేఖలో ప్రస్తావన**

**హైదారాబాద్, అక్టోబర్ 02 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణలోని కీలక విద్యుత్ రంగ సంస్థల్లో వాటాల విక్రయం లేదా ప్రైవేటీకరణ ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి లేఖ రాశారు. టీజీ ట్రాన్స్‌కోలో 26 శాతం వాటాలను ఐపీఓ మిగతాది 2లో...

## గాంధీ ఆరాధించిన రాముడు

# ధనికుల దేవుడా

**కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై బండి సంజయ్ ఫైర్**

**గాంధీ ఆశయాలను ప్రధాని మోదీ నెరవేరుస్తున్నారని, నిజమైన వారసులు బీజేపీయేనని వ్యాఖ్య**

**ఖైరతాబాద్ ఉపఎన్నికలో హిందూ ఓట్లను ఏకం చేసి బీజేపీని గెలిపిస్తామని ధీమా**



**హైదారాబాద్, అక్టోబర్ 02 (జర్నలిస్ట్ వార్త):**
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శుక్రవారం గాంధీ జయంతి వేడుకల సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జమ్మికుంటలో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి మిగతాది 2లో...

# కొడంగల్‌లో సభ పెడతాం

**రేవంత్ కు చెమటలు పట్టిస్తాం**

**ఖైరతాబాద్ లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం**

**తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్ర వ్యాఖ్యలు**

**హైదారాబాద్, అక్టోబర్ 02 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు మరింత తీవ్రమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లోనే భారీ బహిరంగ సభ నిర్వహించి, కాంగ్రెస్ ప్రభుత్వానికి సవాల్ విసురుతామని బీఆర్ఎస్ ప్రకటించింది.
హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి మిగతా 2లో...



# రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉండదు

**19,000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు**

**కరవు పరిస్థితులపై ప్రతిపక్షాలు ఆనందం**

**మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా**

**హైదారాబాద్, అక్టోబర్ 02 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ కొరత లేకుండా ప్రజలకు నిరంతరాయంగా సరఫరా అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా ఇచ్చారు. కరెంట్ కష్టాలు తలెత్తకుండా ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం, నల్గొండలోని తన క్యాంప్ కార్యాలయంలో మిగతాది 2లో...



# గాడ్సే భావజాలాన్ని తిప్పికొట్టాలి

(మొదటి పేజీ తరువాయి

చరిత్రను వక్రీకరించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ప్రతి ఒక్కరూ ఐక్యంగా తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఆయన శ్రద్ధాంజలి ఘటించారు. సత్యం, అహింస, శాంతి మార్గాల ద్వారా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించేలా చేసిన గాంధీజీ ఆశయాలు సదా స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, గాంధీజీ చూపిన మార్గంలోనే తమ ప్రభుత్వం పయనిస్తోందని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా విద్యార్థులందరికీ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యను అందించాలనే ఉద్దేశంతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల'ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. వివక్షకు తావులేని సమసమాజ నిర్మాణమే ప్రజా పాలన అంతిమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

................

# రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉండదు

(మొదటి పేజీ తరువాయి

మంత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఇతర రాష్ట్రాల నుంచి 19,000 మెగావాట్లకు పైగా విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో సుమారు ఐదు గంటల పాటు విద్యుత్, కరవు పరిస్థితులపైనే కూలంకషంగా చర్చించినట్లు తెలిపారు. గతంలో తాను సబ్‌స్టేషన్లలోని లాగ్‌బుక్‌లను తనిఖీ చేసినప్పుడు, కొందరు ఆపరేటర్లు విద్యుత్ సరఫరాలో జరుగుతున్న వ్యత్యాసాలను అంగీకరించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. సింగరేణి బొగ్గు లింకేజీ, నైనీ బ్లాక్ సమస్యలను సత్వరమే పరిష్కరించి, బొగ్గు సరఫరాను పునరుద్ధరించేలా ప్రత్యేక దృష్టి సారించమన్నారు. నల్గొండ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి ద్వారా నియోజకవర్గానికి 5,000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు నెలకొనడంపై ప్రతిపక్షాలు రాజకీయానందం వ్యక్తం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధిస్తారని కోమటిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి హరీశ్ రావు లేఖ

(మొదటి పేజీ తరువాయి

ద్వారా విక్రయించి నిధులు సమీకరించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలో కాంగ్రెస్ జాతీయ నాయకత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ప్రజాధనంతో నిర్మితమైన టీజీ ట్రాన్స్‌కో, రాష్ట్ర విద్యుత్ సరఫరా వ్యవస్థకు వెన్నెముక వంటిదని హరీశ్ రావు తన లేఖలో పేర్కొన్నారు. వేలాది కిలోమీటర్ల మేర విస్తరించిన విద్యుత్ లైన్లు, హై-వోల్టేజ్ సబ్‌స్టేషన్లతో కూడిన ఈ సంస్థ అత్యంత విలువైన ఆస్తి అని వివరించారు. ట్రాన్స్‌కోలో ప్రైవేట్ వాటాలకు అనుమతినిస్తే, భవిష్యత్తులో టీజీ జెన్‌కో, సింగరేణి, డిస్కమ్‌ల ప్రైవేటీకరణకు కూడా ఇది మార్గం సుగమం చేస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం కాంగ్రెస్ పార్టీ 2019 ఎన్నికల మేనిఫెస్టో, 2023 రాయ్‌పూర్ తీర్మానాలకు విరుద్ధమని హరీశ్ రావు ప్రశ్నించారు. వ్యూహాత్మకంగా ప్రాధాన్యత లేని, నష్టాల్లో ఉన్న సంస్థల్లో మాత్రమే పెట్టుబడుల ఉపసంహరణకు కట్టుబడి ఉన్నామని గతంలో కాంగ్రెస్ ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసీ వంటి సంస్థలను ప్రైవేటీకరిస్తుంటే తీవ్రంగా వ్యతిరేకించిన కాంగ్రెస్, రాష్ట్రంలో అధికారంలోకి రాగానే అందుకు భిన్నంగా వ్యవహరించడం ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని నిలదీశారు. విద్యుత్ సంస్థల యాజమాన్య హక్కులపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

కాగా, ప్రైవేటీకరణ, వాటాల విక్రయం లేదా పబ్లిక్ ఇష్యూపై ఇప్పటి వరకు ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని టీజీ ట్రాన్స్‌కో వర్గాలు వెల్లడించాయి.

# హాకీలో స్వర్ణం



(మొదటి పేజీ తరువాయి

ఆ తర్వాత చైనా గోల్ కోసం తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ, భారత రక్షణ శ్రేణి గోడలా నిలిచింది. ముఖ్యంగా, గోల్ కీపర్ సవితా పూనియా ఒక కీలకమైన పెనాల్టీ స్ట్రోక్‌ను అడ్డుకుని జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. చివరి నిమిషం వరకు ఆధిక్యాన్ని కాపాడుకున్న భారత అమ్మాయిలు చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేశారు.భారత మహిళల హాకీ జట్టుకు ఆసియా క్రీడల్లో ఇది రెండో స్వర్ణం మాత్రమే. చివరిసారిగా 1982లో న్యూఢిల్లీలో జరిగిన ఆసియా గేమ్స్‌లో భారత్ స్వర్ణం సాధించింది. మళ్లీ ఇన్నేళ్లకు ఆ ఘనతను పునరావృతం చేసింది. ఈ విజయంతో భారత జట్టు 2028లో జరగనున్న లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించడం మరో విశేషం. ఈ టోర్నీలో అద్భుత ప్రదర్శన కనబరిచిన భారత జట్టు, ఫైనల్‌కు ముందు సెమీఫైనల్లో దక్షిణ కొరియాపై 2-0 తేడాతో గెలిచిన విషయం తెలిసిందే. ఈ చారిత్రాత్మక విజయంపై క్రీడా లోకం హర్షం వ్యక్తం చేస్తోంది. కాగా, తాజా స్వర్ణంతో ఈ ఆసియా క్రీడల్లో భారత్ బంగారు పతకాల సంఖ్య 16కి పెరిగింది.

# కొడంగల్‌లో సభ పెడతాం

(మొదటి పేజీ తరువాయి

తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "కొడంగల్‌లో మేము పెట్టబోయే సభతో ముఖ్యమంత్రికి చెమటలు పట్టిస్తాం" అని ఆయన హెచ్చరించారు. సిద్దిపేటలో సీఎం రేవంత్ రెడ్డి సభ ముగిసిన తర్వాత కొడంగల్‌లో బీఆర్ఎస్ సభ ఉంటుందని తలసాని స్పష్టం చేశారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి... బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియోజకవర్గమైన సిరిసిల్లలో సభ నిర్వహించడాన్ని ఆయన ప్రస్తావించారు. సిరిసిల్ల ఏమైనా పక్క రాష్ట్రంలో ఉందా? అని ప్రశ్నిస్తూ... సిరిసిల్లలో బలప్రదర్శన చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఆ సభ వల్ల సీఎంకు రాజకీయంగా నష్టమే జరిగిందని అన్నారు. ఇదే సందర్భంగా, ఖైరతాబాద్ ఉపఎన్నికపై తలసాని పూర్తి ధీమా వ్యక్తం చేశారు. ఆ ఎన్నికలో బీఆర్ఎస్ వందకు వంద శాతం గెలుస్తుందని జోస్యం చెప్పారు. పార్టీ మారిన దానం నాగేందర్‌పై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, ఈసారి ఓటింగ్ శాతం కూడా పెరుగుతుందని అన్నారు. డబ్బులు ఇచ్చినా ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేయరని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ నుంచి తమ పార్టీ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడాన్ని కూడా తలసాని తప్పుబట్టారు. సభలో తాము చేయని దానికి, బయట జరిగిన వివాదానికి స్పీకర్‌కు ఏం సంబంధమని ఆయన ప్రశ్నించారు.

# గాంధీ ఆరాధించిన రాముడు ధనికుల దేవుడా

(మొదటి పేజీ తరువాయి

నివాళులు అర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గాంధీ వారసత్వం తమదేనని చెప్పుకునే నైతిక అర్హత ఆ పార్టీలకు లేదని ఆయన విమర్శించారు. శ్రీరాముడిని "ధనికుల దేవుడు"గా అభివర్ణించిన కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.నిత్యం 'రామ' నామాన్ని జపించిన గాంధీ ఆరాధించిన రాముడు, కేవలం ధనికులకే దేవుడా, లేక ప్రజలందరి దేవుడా? అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా కాంగ్రెస్ నేతలను బండి సంజయ్ ప్రశ్నించారు. గాంధీజీ సత్యం, ధర్మం, న్యాయంతో కూడిన సనాతన ధర్మాన్ని పాటించారని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్, వారసత్వ రాజకీయాలు, అవినీతి, హిందూత్వ వ్యతిరేకత విధానాలతో నడిచే "ఇటలీ నేషనల్ కాంగ్రెస్" అని, దీనిని నడిపిస్తున్నది "డూప్లికేట్ గాంధీ కుటుంబం" అని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ప్రజల దృష్టిని మళ్లించేందుకే హిందూ సమాజాన్ని విభజించే కుట్రలు చేస్తోందని విమర్శించారు.మరోవైపు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కూడా బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమై గాంధీ, అంబేద్కర్ వంటి జాతీయ నేతల జయంతి కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారని విమర్శించారు. ఎన్నికల్లో ఓటమి అనంతరం ప్రజా జీవితానికి దూరమైన కేసీఆర్, ప్రపంచంలోనే అత్యంత అహంకారపూరిత నాయకుడని దుయ్యబట్టారు. గాంధీ కలలు కన్న రామరాజ్యం, స్వచ్ఛ భారత్ వంటి ఆశయాలను ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం నెరవేరుస్తోందని, గాంధీకి నిజమైన వారసులు తామేనని ఆయన స్పష్టం చేశారు.

త్వరలో జరగనున్న ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నికను ప్రస్తావిస్తూ, ఈ ఎన్నిక రావడానికి కాంగ్రెస్ పార్టీయే కారణమని సంజయ్ ఆరోపించారు. ఆ నియోజకవర్గంలోని 2 లక్షల మంది హిందూ ఓటర్లను విస్మరించి, కేవలం 32,000 ముస్లిం ఓట్లపైనే కాంగ్రెస్ ఆశలు పెట్టుకుందని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసినా ప్రజలు వారిని తిరస్కరిస్తారని, ఖైరతాబాద్‌లో హిందూ ఓటర్లను ఏకం చేసి బీజేపీని గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. "డబుల్ ఇంజిన్" సర్కారుతోనే తెలంగాణ సమగ్రాభివృద్ధి సాధ్యమని ఆయన పునరుద్ఘాటించారు.

# మీరు నా ఆరాధ్య దైవం

## మోదీతో అంటూ స్మిత్ భావోద్వేగం

**అక్టోబర్ 02 (జర్నలిస్ట్ వార్త):**
విమానంలో తోటి పైలట్ దాడిని ఎదుర్కొని, 174 మందికి పైగా ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన ఫ్లైదుబాయ్ విమాన కెప్టెన్ స్మిత్ మచ్చర్‌తో భారత ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ఫోన్‌లో మాట్లాడారు. ప్రస్తుతం యూఏఈలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్మిత్ యోగక్షేమాలను ప్రధాని అడిగి తెలుసుకున్నారు.

ఆయన ధైర్యసాహసాలను కొనియాడుతూ, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రధాని నుంచి ఫోన్ కాల్ రావడంతో స్మిత్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తనకు అతిపెద్ద ఆరాధ్య దైవం, ఆదర్శప్రాయుడు ప్రధాని మోదీయేనని, ఆయనతో మాట్లాడే అవకాశం వస్తుందని కలలో కూడా ఊహించలేదని ఆనందం వ్యక్తం చేశారు.

దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కాక్‌పిట్‌లో ఉన్న కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై తోటి పైలట్ కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడి కుప్పకూలినప్పటికీ, స్మిత్ అసామాన్యమైన ధైర్యాన్ని ప్రదర్శించారు. చివరి క్షణంలో కాక్‌పిట్ డోర్ లాచ్‌ను నొక్కి తలుపు తెరిచారు.

దీంతో ప్రయాణికులు వెంటనే లోపలికి ప్రవేశించి, దాడి చేస్తున్న పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. స్మిత్ సమయస్ఫూర్తి వల్ల 9/11 తరహా పెను ప్రమాదం తప్పిందని, 174 మందికి పైగా సురక్షితంగా బయటపడ్డారని ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రధానితో సంభాషణ సందర్భంగా స్మిత్ ఒక ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. తాను కష్ట సమయాల్లో ఉన్నప్పుడు హనుమాన్ చాలీసా పఠిస్తానని, విమానంలో దాడి జరిగినప్పుడు కూడా ప్రాణాలతో పోరాడుతూ హనుమాన్ చాలీసానే చదువుకున్నానని వివరించారు.

అనంతరం ప్రధాని మోదీ, స్మిత్ తల్లి గీతా బెన్‌తో కూడా మాట్లాడారు. భగవద్గీత విలువలు, బోధనలతో కుమారుడిని పెంచినందుకు ఆమెను అభినందించారు. స్మిత్ త్వరగా కోలుకోవడానికి అవసరమైన వైద్య సహాయంతో పాటు అన్ని విధాలుగా కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రధాని మోదీ వారి కుటుంబానికి భరోసా ఇచ్చారు.

# కరవుసీమ ఇకపై కనకసీమ



(మొదటి పేజీ తరువాయి

అన్నమయ్య జిల్లా మదనపల్లెలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి 'రాయలసీమ హార్టికల్చర్ హబ్', 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'లకు ఆయన శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. సాగునీరు అందిస్తే సీమ రైతులు బంగారం పండిస్తారని అన్నారు. రూ. లక్ష కోట్ల పెట్టుబడితో రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, కరవు సీమ ఇకపై కనకసీమగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. 2026 అక్టోబర్ 2వ తేదీ ఈ ప్రాంత చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అదనంగా ఆరు లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలను విస్తరిస్తామని, ఈ హబ్ ద్వారా పంటల ఉత్పత్తి, ధరల స్థిరీకరణ సాధ్యమవుతుందని వివరించారు.

ఎన్టీ రామారావు ప్రారంభించిన సాగునీటి ప్రాజెక్టులను ముందుకు తీసుకెళుతున్నామని, హంద్రీనీవా లేకపోతే మదనపల్లె ప్రాంతం వలసలతో ఖాళీ అయ్యేదని గుర్తుచేశారు. మూడేళ్లలో రూ.35,000 కోట్లతో 36 ప్రాజెక్టులను పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. హంద్రీనీవా ఫేజ్-2, వెలిగొండ ఫేజ్-2, మడకశిర బ్రాంచ్ కెనాల్ విస్తరణ పనులను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీని 'ఆంధ్రా బిడ్డ' అని అభివర్ణించిన చంద్రబాబు, తిరుమలకు ఉచితంగా ఎలక్ట్రిక్ బస్సులు అందించడంపై ప్రశంసించారు. పోలవరం ప్రాజెక్టు పనులు వేగంగా సాగుతున్నాయని, దాన్ని కూడా పూర్తి చేసి ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభిస్తామని తెలిపారు.

### రాయలసీమ రైతుల తల రాతలు మారబోతున్నాయి: పవన్ కల్యాణ్

రాయలసీమను ప్రపంచ స్థాయి ఉద్యాన కేంద్రంగా (గ్లోబల్ హార్టికల్చర్ హబ్) తీర్చిదిద్దే ప్రాజెక్టుకు శుక్రవారం అంకురార్పణ జరిగింది. మదనపల్లెలో 'రాయలసీమ రైజింగ్' పేరుతో చేపట్టిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... రూ. లక్ష కోట్ల పెట్టుబడితో చేపడుతున్న ఈ ప్రాజెక్టుతో రాయలసీమ రైతుల తలరాతలు మారబోతున్నాయని, ఇది ఒక చరిత్రాత్మక ఘట్టమని అన్నారు. కష్టపడి పనిచేసే సీమ రైతులకు ప్రభుత్వం అండగా నిలిచి, సాంకేతికతను అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారని కొనియాడారు. హార్టికల్చర్ హబ్‌తో పాటు, అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేయనున్న ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు కూడా పునాదిరాయి వేశామన్నారు.

ఈ ప్రాజెక్టు ద్వారా సీమలోని కరవు పీడిత ప్రాంతాల్లో ఉద్యాన పంటల సాగును గణనీయంగా పెంచుతామని, సూక్ష్మ సేద్యం ద్వారా నీటి సంరక్షణకు పెద్దపీట వేస్తామని పవన్ తెలిపారు. రైతులు పండించే నాణ్యమైన పంటలకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ మెగా ప్రాజెక్టులతో రాయలసీమ జిల్లాల్లోని లక్షలాది మంది రైతులకు స్థిరమైన ఆర్థిక భద్రత లభిస్తుందని... ఈ ప్రాజెక్టు దేశ వ్యవసాయ రంగంలోనే ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

### సీఎం చంద్రబాబు గారూ.. 'నన్ను ఆంధ్రా బిడ్డగా భావించండి.. రాష్ట్రానికి ఏం చేయగలనో చెప్పండి': అనంత్ అంబానీ

రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ ఆంధ్రప్రదేశ్ ప్రజల పట్ల తనకున్న అభిమానాన్ని, రాష్ట్ర అభివృద్ధికి చేయూతనివ్వాలన్న తన సంకల్పాన్ని బలంగా చాటిచెప్పారు. "నన్ను మీ ఆంధ్ర బిడ్డగా భావించండి. రాష్ట్రానికి నేనేం చేయాలో, ఏ సేవ అందించాలో మీరే మార్గనిర్దేశం చేయండి" అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఆయన వినమ్రంగా కోరారు.

గ్లోబల్ హార్టికల్చర్ హబ్, 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్' (ఐఎస్ఏ) శంకుస్థాపన కార్యక్రమంలో అనంత్ అంబానీ చేసిన ప్రసంగం సభికులను, వేదికపై ఉన్న ప్రముఖులను విశేషంగా ఆకట్టుకుంది. ఆయన ప్రసంగం ముగిసిన వెంటనే సీఎం చంద్రబాబు అనంత్‌ను ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని అభినందించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ కూడా ఆయన ప్రసంగాన్ని ప్రశంసించారు.



ఈ సందర్భంగా అనంత్ అంబానీ మాట్లాడుతూ.. రాయలసీమలో ఏర్పాటవుతున్న హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. "ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) తరహాలోనే ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ కూడా ఉన్నత ప్రమాణాలతో ఎదుగుతుంది. ఈ సంస్థ ద్వారా అన్నదాతలను వారి కమతాలకే సీఈఓలుగా మారుస్తాం. ఆంధ్రభూమి స్వర్ణభూమిగా మారడం ఖాయం" అని ఆయన అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కలలుగన్న 'వికసిత్ భారత్' స్వప్నాన్ని తనలాంటి యువత సాకారం చేసి చూపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంట్ల ఏర్పాటుకు దేశవ్యాప్తంగా రూ.1 లక్ష కోట్లు పెట్టుబడి పెడుతున్నట్లు వెల్లడించారు. 'కియో కృషి' ద్వారా రైతులకు జియో పూర్తి సహకారం అందిస్తుందని, 'దేశ్ సేవా-కిసాన్ సేవా' తమ నినాదమని స్పష్టం చేశారు. 'పశు సేవా హీ ప్రభు సేవా' అని తాను విశ్వసిస్తానని, 'వంతారా' ద్వారా జంతు సంరక్షణకు తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. ఏపీలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అద్భుతంగా ఉందని, అందుకే రాష్ట్రం పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షిస్తోందని కొనియాడారు.

# డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా అల్పాహార పథకం

(మొదటి పేజీ తరువాయి

మద్దతుగా జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థలు ముందుకొచ్చాయి. నాగర్‌కర్నూల్‌లో కిచెన్ ఏర్పాటుకు జున్నా సోలార్ సిస్టమ్స్ తరఫున సీఎండీ శేఖర్ రెడ్డి, సీఈఓ అనిల్ బాబు రూ. 5.17 కోట్ల చెక్కును, వికారాబాద్‌లో కిచెన్ ఏర్పాటుకు చైన్ ల్యాబ్స్ ఇండియా తరఫున ప్రతినిధి డి. సుమంత్, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్ కుమార్ రూ. 4 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి చేతుల మీదుగా హరేకృష్ణ ఫౌండేషన్‌కు అందజేశారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు అందించే ఆహారంలో కేలరీలను లెక్కించేందుకు ప్రత్యేక యాప్‌లను వినియోగించాలని సూచించారు. స్థానిక ఆహారపు అలవాట్లకు అనుగుణంగా మెనూ ఉండాలని, ఆహార నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం దీర్ఘకాలం కొనసాగేలా సెంట్రల్ కిచెన్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని ఆదేశించారు. విద్యార్థుల్లో పోషకాహారం విలువలను పెంచి, హాజరుశాతాన్ని మెరుగుపరచడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, హరేకృష్ణ ఫౌండేషన్ ప్రతినిధి సత్య గౌర చంద్రదాస్ స్వామీజీ తదితరులు పాల్గొన్నారు.

# గాంధీజీ మార్గంలో నడవాలి

## మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి



**వర్ధన్నపేట/ అక్టోబరు 2 (జర్నలిస్ట్ వార్త):**వర్ధన్నపేట మున్సిపల్ కార్యాలయంలో మహాత్మా గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ సత్యం, అహింస, శాంతి, స్వచ్ఛత వంటి విలువలను ప్రజలకు ఆదర్శంగా చూపారని తెలిపారు. ఆయన చూపిన మార్గాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని, సమాజ అభివృద్ధిలో పౌరులు తమ బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. స్వచ్ఛతకు గాంధీజీ ఇచ్చిన ప్రాధాన్యతను స్ఫూర్తిగా తీసుకుని వర్ధన్నపేటను పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నేతావత్ శిభారాణి, కౌన్సిలర్లు బెజ్జం పాపారావు, గుజ్జ వీర రాఘవరావు, మాలోతు దేవేందర్, తిరుపతి సురేష్, సిలువేరు కుమారస్వామి, తిరుపెల్లి వాణి, నాయకులు నేతావత్ రాజేందర్, బానోతు నవీన్, నునావత్ కిమా నాయక్, రాజశేఖర్, అధికారులు శ్రావణ్‌కుమార్, కరుణాకర్, కాసర్ల ఐలయ్య, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ ఆశయాల బాటలో నడవాలి

## అధ్యక్షుడు డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్‌గౌడ్



**నర్సంపేట/అక్టోబర్ 2 (జర్నలిస్ట్ వార్త):** మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని నర్సంపేట వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నర్సంపేటలోని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. సమాజంలో ఐక్యత, సేవాభావం, పరిశుభ్రతతో పాటు ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ నిత్యం నడకను జీవితంలో భాగంగా చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి వాకర్స్ అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆడెపు సదానందం, కోశాధికారి సంకినేని కృష్ణ, పాషా, సాంబయ్య, అశోక్, రామస్వామి, శారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ జయంతి వేడుకలపై విచారణకు డిమాండ్



**నర్సంపేట/అక్టోబర్ 2 (జర్నలిస్ట్ వార్త):** గురిజాల గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీ జయంతి కార్యక్రమంలో స్వాతంత్ర్య సమరయోధుడి విగ్రహానికి పూలమాల వేసే సమయంలో పంచాయతీ కార్యదర్శి పాదరక్షలు ధరించి ఉండటంపై గ్రామస్థుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. జాతీయ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకునే కార్యక్రమాల్లో తగిన గౌరవం, మర్యాద పాటించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. ఈ ఘటనపై సంబంధిత ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాలని గ్రామస్థులు కోరుతున్నారు. బాధ్యత వహించిన వారి విషయంలో నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాతీయ పర్వదినాలు, స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ నాయకుల కార్యక్రమాల నిర్వహణపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసి, సిబ్బందికి అవగాహన కల్పించాలని కోరారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గ్రామస్థులు పేర్కొన్నారు.

# గాంధీ జయంతితో పాటు గ్రామసభ



**వైరా/ అక్టోబర్ 2 (జర్నలిస్ట్ వార్త):** తాటిపూడి గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం మహాత్మా గాంధీ జయంతి వేడుకలతో పాటు గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ జవ్వాజి అశ్విని అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎస్కే ఇస్మాయిల్, పంచాయతీ కార్యదర్శి అజయ్‌కుమార్, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామదీపికలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సాంకేతిక సహాయకురాలు తాత నిర్మల, మాజీ సర్పంచ్ బండి కోటయ్య, గ్రామ మల్టీపర్పస్ వర్కర్లు, గ్రామపెద్దలు, ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ అశ్విని మాట్లాడుతూ.. గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్య సాధనకు గ్రామాల అభివృద్ధే కీలకమన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికీ అందేలా కృషి చేస్తామని తెలిపారు. నిరుపేదలకు అండగా ఉంటూ గ్రామాభివృద్ధికి తన సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు.

# గాంధీ ఆశయాలు ఆదర్శం

## ఎమ్మెల్యే, కె.ఆర్. నాగరాజు





**పర్వతగిరి/అక్టోబర్ 2(జర్నలిస్ట్ వార్త):** మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి, సామాజిక సమానత్వం, గ్రామ స్వరాజ్య స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే, కె.ఆర్. నాగరాజు అన్నారు. పర్వతగిరి మండల కేంద్రంలో మహాత్మా గాంధీ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ పాత్ర చిరస్మరణీయమని, ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విగ్రహ ఏర్పాటుకు సహకరించిన దాత స్వయం ప్రకాష్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎర్రబెల్లి ఉష దయాకర్, సావిత్రి, సర్పంచ్ శంకర్, పిన్నింటి అనిల్‌రావు, అత్తి కుమారస్వామి, బానోత్ సింగులాల్, కుసం రామచందర్, డాక్టర్ గొడుగు బిక్షపతి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ





**కల్లూరు/ అక్టోబర్ 2 (జర్నలిస్ట్ వార్త):** కల్లూరు మండలం చెన్నూరు గ్రామంలో నిరుపేదలకు డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కొనసాగుతోంది. రేషన్ డీలర్లు అమల, నాగేశ్వరరావు, సుబ్బారావు ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో లబ్ధిదారులకు కార్డులను అందజేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్న నేపథ్యంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి రేషన్ అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు డీలర్లు తెలిపారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక సభ నిర్వహించారు. గాంధీజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజలు సహకరించాలని సర్పంచి, ఉపసర్పంచి కోరారు. గ్రామాభివృద్ధికి సమష్టిగా కృషి చేసి చెన్నూరును రాష్ట్రంలోనే ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సర్పంచి, ఉపసర్పంచి, వీఆర్వో, గ్రామస్థులు పాల్గొన్నారు.

# గాంధీ ఆశయాలే స్ఫూర్తిగా ముందుకు సాగాలి




**తల్లాడ/అక్టోబర్ 2 (జర్నలిస్ట్ వార్త):** శాంతి, అహింస మార్గంలో దేశ స్వాతంత్ర్య ఉద్యమానికి దిశానిర్దేశం చేసిన మహాత్మాగాంధీ ఆశయాలను నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తల్లాడ మండల కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు గొడుగులూరు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకుడు దుండేటి వీరారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గాంధీజీ దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. శాంతియుత పోరాటాలతో స్వాతంత్ర్య సాధనకు ఆయన చేసిన కృషిని వివరించారు. గాంధీజీ ఆశయాలు, సిద్ధాంతాలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తాళ్ల జోసెఫ్, మాజీ జడ్పీటీసీ మూకరా ప్రసాద్, బొడ్డు వెంకటేశ్వరరావు, మారెళ్ల మల్లికార్జునరావు, వెంకట నారాయణరెడ్డి, రేగళ్ల శ్రీను, టీసీసీ మీడియా అధ్యక్షుడు నారపోగు ప్రసాద్, కోటేరు వెంకటరెడ్డి, భద్రారెడ్డి, స్టాలిన్, నిజాముద్దీన్, నాగేశ్వరరావు, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లంద గ్రామంలో గాంధీ జయంతి వేడుకలు ఘనం



**వర్ధన్నపేట/ అక్టోబరు 2 (జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, పార్టీ శ్రేణులు, ముదిరాజ్ కుల సంఘం నాయకులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బేతి సాంబయ్య, మండల పార్టీ అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, మాజీ సర్పంచ్ సుంకరి సాంబయ్య, దేవస్థానం చైర్మన్ ఏడుకొండ వేణుగోపాలరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు అంబటి ఎల్లాస్వామి, రైతు కన్వీనర్ నాంపల్లి వెంకన్న, వార్డు సభ్యులు అందే కృష్ణమూర్తి, సంగినేని భీమరాజు, మండల నాయకుడు పిట్టల రాజు, మాజీ ఎంపీటీసీ సోడెం నాగయ్య, ముదిరాజ్ కుల పెద్దలు సుంకరి స్వామి, పిట్టల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# బయ్యారంలో గాంధీజీకి కాంగ్రెస్ శ్రేణుల ఘన నివాళి



**బయ్యారం/అక్టోబర్ 2.(జర్నలిస్ట్ వార్త)**

బయ్యారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీ సెంటర్‌లో మహాత్మా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్‌లు,ఉపసర్పంచ్‌లు,మాజీ ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బయ్యారం సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్ మాట్లాడుతూ సత్యం,అహింసను ఆయుధాలుగా చేసుకుని దేశానికి స్వాతంత్ర్యం సాధించిన మహనీయుడు మహాత్మా గాంధీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు పాల్గొన్నారు.

# ఎల్కతుర్తిలో గాంధీ జయంతి వేడుకలు



**ఎల్కతుర్తి/అక్టోబర్ 2(జర్నలిస్ట్ వార్త):** ఎల్కతుర్తి మండల కేంద్రంతోపాటు దామెర, చింతలపల్లి, గోపాల్‌పూర్, వల్భాపూర్ తదితర గ్రామాల్లో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలతో పాటు గ్రామాల్లో గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. గ్రామాల్లో సర్పంచులు కొబ్బరికాయలు కొట్టి గాంధీజీ చిత్రపటాలను పుష్పాలతో అలంకరించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు రాజేష్, గణపతి, శైలజ, శ్రీనివాస్‌రావుతో పాటు సర్పంచులు మంకని పద్మ, రజిత, లక్ష్మి, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన ర్యాలీ






**తల్లాడ/అక్టోబర్ 2 (జర్నలిస్ట్ వార్త):** వన్యప్రాణులు, అటవీ సంపద పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తల్లాడలో అటవీ శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అక్టోబరు 2 నుంచి 8 వరకు నిర్వహిస్తున్న వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సత్తుపల్లి అటవీ డివిజన్ పరిధిలోని తల్లాడ రేంజ్ కనకగిరి రిజర్వ్ ఫారెస్ట్‌లోని వన్యప్రాణులు, జీవవైవిధ్యాన్ని ప్రతిబింబించే అవగాహన బ్రోచర్‌ను అదనపు కలెక్టర్ అజయ్ యాదవ్ తల్లాడ మండల రెవెన్యూ కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అడవులు, వన్యప్రాణులు, జీవవైవిధ్యాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ప్రకృతి సంపదను కాపాడితే భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. అటవీ రేంజ్ అధికారి జీ. ఉమా ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. వన్యప్రాణులను కాపాడాలని, అడవులను పరిరక్షించాలని, అటవీ ప్రాంతాల్లో అక్రమ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించారు.

**మొక్కలు నాటి.. సంరక్షించాలి.**

ర్యాలీ అనంతరం మండల అభివృద్ధి అధికారి కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించి పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అటవీ అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పి.కరుణాకర్‌రెడ్డి, ఎంపీడీవో అంబటి శ్రీధర్‌రాజు, అటవీ రేంజ్ అధికారి జీ.ఉమా, అటవీ అధికారులు సురేష్, కవిత, కిషోర్, బీట్ అధికారులు స్వాతి, భీమా, సిద్ధారావు, అటవీ శాఖ సిబ్బంది, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# గ్రామసభల్లో 375 రకాల పనులపై అవగాహన



దన్నపేటలో నిర్వహించిన గ్రామ సభా

**వర్ధన్నపేట/అక్టోబర్ 2 (జర్నలిస్ట్ వార్త):** మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని వర్ధన్నపేట మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో గురువారం గ్రామసభలు నిర్వహించారు. గ్రామసభల్లో వీబీజీ రామ్‌జీ పథకం కింద చేపట్టనున్న 375 రకాల పనులపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లోని వనరులు, అవసరాలు, అభివృద్ధి పనులను మ్యాప్‌ల ద్వారా వివరించారు.

ఉప్పరపల్లి, దమ్మన్నపేట గ్రామపంచాయతీల్లో నిర్వహించిన గ్రామసభల్లో సర్పంచ్‌లు గ్రామ వనరుల పటాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఏపీవో నాగేష్ మాట్లాడుతూ గ్రామంలోని సహజ, ప్రజా వనరులను గుర్తించి, స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టేందుకు వనరుల పటాలు ఉపయోగపడతాయన్నారు. గ్రామసభల్లో ప్రజల సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం పెంచేందుకు గ్రామసభలను సమర్థంగా వినియోగించుకోవాలని తెలిపారు.





ఉపరిపెల్లి గ్రామంలో జరిగిన గ్రామసభ

## ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు



**తల్లాడ/అక్టోబర్ 2 (జర్నలిస్ట్ వార్త):** మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని తల్లాడ మండల, పట్టణ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. తల్లాడలోని శ్రీ వాసవి కన్వెన్షన్ హాల్ వద్ద ఉదయం జాతీయ పతాకాన్ని మండల ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు నంబూరి మోహన్‌రావు ఆవిష్కరించారు. అనంతరం గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సత్యం, అహింస, సత్యాగ్రహం, శాంతి మార్గాల్లో గాంధీజీ సాగించిన పోరాటం దేశ చరిత్రలో చిరస్మరణీయమన్నారు. గాంధీజీ ఆశయాలను నేటి తరం ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. దేశ సమైక్యత, సామాజిక బాధ్యత, స్వచ్ఛత వంటి గాంధీజీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు అనుమోల సర్వేశ్వరరావు, జవ్వాజి పెద్ద నగేష్, వేమిశెట్టి వెంకటయ్య, నంబూరి నాగేశ్వరరావు, పసుమర్తి భద్రయ్య, వేమిశెట్టి జగదీష్, కుంచం రామకృష్ణ, పసుమర్తి మురళి, నంబూరి బాబు, ఎన్‌కేడీ ప్రసాద్, మిట్టపల్లి కృష్ణ, పసుమర్తి కాశి, బందారు భద్రయ్య, వేమిశెట్టి సంతోష్, లగడపాటి నెహ్రూ, వేమిశెట్టి శంకర్, కొత్తూరు సతీష్, కుమార్, షరాబు మణికంత, వేమిశెట్టి పార్థసారథి, గోపాలకృష్ణ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాల మంజూరుపై పాలాభిషేకం



**స్టేషన్‌ఘన్‌పూర్/ అక్టోబర్ 2 (జర్నలిస్ట్ వార్త):** స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరుకు కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి చిత్రపటాల ఫ్లెక్సీలకు కాంగ్రెస్ పట్టణ అధికార ప్రతినిధి పోశాల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పోశాల కృష్ణమూర్తి మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా డిగ్రీ కళాశాల కోసం ఎదురుచూస్తున్న పేద విద్యార్థుల ఆకాంక్ష నెరవేరిందన్నారు. ఉన్నత విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లలేక ఆర్థిక ఇబ్బందులతో చదువును మధ్యలోనే నిలిపివేసే పరిస్థితి ఇక ఉండదన్నారు. కళాశాలతో పాటు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. ఏడాదిలోగా భవన నిర్మాణం పూర్తిచేసే దిశగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి కృషి చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గ విద్యార్థుల తరపున ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు షేక్ జానీబాబా, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మేకల మల్లేష్, ముగ్ధంపురం కిషోర్, తోట బిక్షపతి, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుర్రం ఫాతికుమార్, గుర్రం రమేష్, అనిల్, ఉమాశంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయాలి

### జిల్లా అధ్యక్షుడు సారంపల్లి వాసుదేవరెడ్డి




**హసన్‌పర్తి/ అక్టోబర్ 2 (జర్నలిస్ట్ వార్త):** గ్రామీణ పేదలు, వ్యవసాయ కార్మికుల ఉపాధి హక్కులను కాపాడాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సారంపల్లి వాసుదేవరెడ్డి కోరారు. గాంధీ జయంతి సందర్భంగా హసన్‌పర్తి మండల కేంద్రంలోని గాంధీ విగ్రహానికి సంఘం ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధి హామీ పథకం పరిరక్షణకు సంబంధించిన డిమాండ్లతో వినతిపత్రం సమర్పించారు. వాసుదేవరెడ్డి మాట్లాడుతూ.. గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం, గ్రామీణ పేదల సంక్షేమం స్ఫూర్తిగా ఉపాధి హామీ పథకాన్ని మరింత బలోపేతం చేయాలన్నారు. ప్రతి గ్రామీణ కుటుంబానికి ఏటా 200 రోజుల పని కల్పించాలని, రోజువారీ వేతనాన్ని రూ.800కు పెంచాలని డిమాండ్ చేశారు. పని కోరిన ప్రతి ఒక్కరికీ సకాలంలో ఉపాధి కల్పించి, వేతనాలను ఆలస్యం లేకుండా చెల్లించాలన్నారు. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు, సామాజిక భద్రత, ప్రమాద బీమా కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి మంద సుచందర్, జిల్లా కమిటీ సభ్యురాలు వేలు రజిత, సంఘ సభ్యులు హర్ష, సురేష్, రమణారెడ్డి, శివ, సుకన్య, అశ్విని, చందన, రమ్య తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు ప్రోత్సహిస్తే జైలుకే

### -గార్ల బయ్యారం సీఐ రవీందర్.

**బయ్యారం/,అక్టోబర్ 2.(జర్నలిస్ట్ వార్త)**

బాల్య వివాహాలను అరికట్టేందుకు పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో బయ్యారం మండల పరిధిలో మైనర్ బాలికను వివాహం చేసుకున్న యువకుడితో పాటు, వివాహానికి సహకరించిన అతని తల్లిదండ్రులను పోలీసులు అరెస్ట్ చేశారు. మైనర్ బాలికను వివాహం చేసుకున్న అనంతరం ఆమె గర్భం దాల్చిన విషయం అధికారుల దృష్టికి వచ్చింది. ఈ ఘటనపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఫిర్యాదు చేయడంతో బయ్యారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. గార్ల-బయ్యారం సీఐ రవీందర్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో బాల్య వివాహానికి సంబంధించిన ఆరోపణలు నిర్ధారణ కావడంతో యువకుడితో పాటు అతని తల్లిదండ్రులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం వారికి రిమాండ్ విధించింది. ఈ సందర్భంగా సీఐ రవీందర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం, వాటికి సహకరించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. బాల్య వివాహాల సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు, సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

# అహింసే ఆయుధం.. గాంధీ బాటే ఆదర్శం



**స్టేషన్‌ఘన్‌పూర్/ అక్టోబర్ 2 (జర్నలిస్ట్ వార్త):** సత్యం, అహింస, శాంతి మార్గాలతో దేశానికి స్వాతంత్ర్యం సాధించిన మహాత్మా గాంధీ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్‌కుమార్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపల్ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి చైర్మన్ వినయ్‌కుమార్, కమిషనర్ బి.రాధాకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వినయ్‌కుమార్ మాట్లాడుతూ ఆయుధం పట్టకుండా అహింసనే బలంగా మలచుకుని బ్రిటిష్ పాలనను ఎదుర్కొన్న మహనీయుడు గాంధీజీ అని కొనియాడారు. ఆయన కలలుగన్న శాంతి, సౌభ్రాతృత్వం సమాజంలో వెల్లివిరియాలంటే ప్రతి ఒక్కరూ గాంధీ ఆశయాలను ఆచరణలో పెట్టాలని సూచించారు. దేశ, రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ నీల రాజమ్మగట్టయ్య, కౌన్సిలర్లు గట్టు సంగీత, బొల్లు లక్ష్మి, తోకల అనూషరాజు, పెసరు కృష్ణవేణి సారయ్య, పొన్నం స్వరూపరాజయ్య, గుర్రం హరినాథ్, సుమలత కుమార్, పొన్న రవి, కోఆప్షన్ సభ్యులు బూర్ల లతాశంకర్, గన్ను నరసింహులు, మాషూక్, రహమతున్నీసాబేగం, మేనేజర్ సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ చుక్క లింగయ్య, సీనియర్ అకౌంటెంట్ నితిన్, మున్సిపల్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గాంధీజీ ఆశయాలే మార్గదర్శకం

### వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు





**హసన్‌పర్తి/అక్టోబర్ 2 (జర్నలిస్ట్ వార్త):** గాంధీజీ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని శాంతి, సౌభ్రాతృత్వం, సామాజిక సమానత్వం కోసం కృషి చేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రాంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీజీ జయంతి వేడుకల్లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి కేఆర్ నాగరాజు పాల్గొని గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం పబ్లిక్ గార్డెన్‌లోని గాంధీజీ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్లు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# అశాంతికి అహింసే సమాధానం





**హసన్‌పర్తి/అక్టోబర్ 2 (జర్నలిస్ట్ వార్త):** పరస్పర గౌరవం, సహనం తగ్గుతున్న నేటి సమాజంలో మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలే ఆదర్శమని కిట్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బొక్క కుమార్ అన్నారు. గాంధీజీ 157వ జయంతి సందర్భంగా శుక్రవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బొక్క కుమార్ మాట్లాడుతూ అహింస, సత్యాగ్రహంతో బ్రిటిష్ పాలనను ఎదుర్కొని దేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో గాంధీజీ కీలక పాత్ర పోషించారని తెలిపారు. స్వయంసేవ, స్వావలంబన, సమయపాలనకు ఆయన ఇచ్చిన ప్రాధాన్యం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. వ్యక్తుల మధ్య రాగద్వేషాలు, అసహనం పెరుగుతున్న పరిస్థితుల్లో గాంధీ ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారా సమాజంలో శాంతిని పెంపొందించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 303 ఇంటర్నేషనల్ వాకర్స్ డిప్యూటీ గవర్నర్ నాగమల్ల సుధీర్, గౌరవ అధ్యక్షుడు పాపిశెట్టి శ్రీధర్, కార్యదర్శి చకిలం చంద్రశేఖర్, కోశాధికారి గూడూరు లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు వేల్పుల తిరుపతి, సలహాదారులు బోడ యుగంధర్, గంగినేని, కార్యవర్గ సభ్యులు ఏరుకొండ రమేష్, గొల్ల సాంబయ్య, మీడియా ఇన్‌చార్జి మీసం అనిల్‌రెడ్డి, వాకర్స్ మిత్రులు పాల్గొన్నారు.

# మతసామరస్యాన్ని కాపాడుదాం

### సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి

**హసన్‌పర్తి/అక్టోబర్ 2 (జర్నలిస్ట్ వార్త):** మతసామరస్యాన్ని కాపాడుతూ భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి పిలుపునిచ్చారు. సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు హసన్‌పర్తి మండల కేంద్రంలో మహాత్మా గాంధీ విగ్రహానికి సీపీఐ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మతసామరస్య పరిరక్షణకు సంబంధించిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా నేదునూరి జ్యోతి, సీనియర్ నాయకుడు మోతె లింగారెడ్డి మాట్లాడుతూ దేశంలో మతం పేరుతో విభజన, విద్వేషాలకు తావివ్వకుండా లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయాన్ని పరిరక్షించాలన్నారు. గాంధీజీ ఆశయాల సాధనకు ప్రజలు ఐక్యంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నేదునూరి రాజమౌళి, మండల కార్యదర్శి మెట్టు శ్యామ్‌సుందర్‌రెడ్డి, దొమ్మటి ప్రవీణ్‌కుమార్, మాదాసి బాబు, ముజీగ పరుశరాములు, షేక్ బాబు, నాంపల్లి లక్ష్మయ్య, గోపరాజు కుమారస్వామి, ముజిగా అజయ్, కల్వచర్ల వెంకటేశ్వర్లు, దుస్స వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# కోయగూడెం ఆదర్శ మహిళలకు స్టీల్ బాక్సుల పంపిణీ.





**బయ్యారం/,అక్టోబర్ 2.(జర్నలిస్ట్ వార్త)**

గాంధీ జయంతి సందర్భంగా బయ్యారం మండలం కోయగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ లింగ నాయక్ అధ్యక్షతన ఘనంగా గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలో '4-వేస్ సెగ్రిగేషన్' ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేస్తూ, గ్రామాభివృద్ధికి, పరిశుభ్రతకు ఎంతగానో సహకరిస్తున్న ఆదర్శ మహిళలను పంచాయతీ పాలకవర్గం ప్రత్యేకంగా అభినందించింది. సర్పంచ్ లింగ నాయక్ చేతుల మీదుగా సదరు ఆదర్శ మహిళలకు స్టీల్ బాక్సులను అందజేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రతలో మహిళల పాత్ర అత్యంత ప్రశంసనీయమని, చెత్త సేకరణ, విభజనలో వారు చూపుతున్న చొరవ ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడారు. పరిశుభ్ర కోయగూడెం లక్ష్యంగా సాగుతున్న ఈ బృహత్తర కార్యక్రమానికి సహకరిస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బందికి, వార్డు సభ్యులకు మరియు గ్రామ ప్రజలందరికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కే. రాజు, ఎంపిఓ నాగరాజు, ఏఈఓ ఫయాజ్ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ చూపిన మార్గం ఆదర్శనీయం

## మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్‌కుమార్



**స్టేషన్‌ఘన్‌పూర్/అక్టోబర్ 2 (జర్నలిస్ట్ వార్త):** మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలు నేటి సమాజానికి ఆదర్శనీయమని మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్‌కుమార్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపల్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి చైర్మన్ వినయ్‌కుమార్, కమిషనర్ బి.రాధాకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ఆయుధం పట్టకుండా అహింసా మార్గంలో బ్రిటిష్ పాలన నుంచి దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు గాంధీజీ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను ఆచరిస్తూ దేశ, రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నీల రాజమ్మ గట్టయ్య, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ జయంతి వేడుకల్లో కాంగ్రెస్ నేతల నివాళి



**స్టేషన్‌ఘన్‌పూర్/అక్టోబర్ 2 (జర్నలిస్ట్ వార్త):** గాంధీ జయంతి సందర్భంగా స్టేషన్‌ఘన్‌పూర్ గాంధీ కూడలిలో కాంగ్రెస్ పార్టీ, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్య శిరీష్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కిషన్‌రాజ్, మండల అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గాంధీజీ చూపిన అహింస, సత్యం, శాంతి మార్గాలను ప్రతి పౌరుడు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆయన ఆశయాలను స్మరించుకుంటూ సమాజంలో సౌభ్రాతృత్వం, ఐక్యతను పెంపొందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.రాధాకృష్ణ, పోగుల సారంగపాణి, నగరబోయిన శ్రీరాములు, జయపాల్‌రెడ్డి, గట్టు రమేష్, చింత ఎల్లయ్య, గుర్రం ఫాతికుమార్, మాతంగి దేవయ్య, మేకల మల్లేశం, సింగపురం దయాకర్, పోశాల కృష్ణ, రాఘవరెడ్డి, చేపూరి ప్రభాకర్, జీడి ప్రసాద్, సింగపురం వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# యూత్ నాయకుడిని పరామర్శించిన ఎమ్మెల్యే నాగరాజు



**హసన్‌పర్తి/ అక్టోబర్2 (జర్నలిస్ట్ వార్త):** పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ యువ నాయకుడు పుల్లూరి దిలీప్ ఇటీవల అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు శుక్రవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. దిలీప్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవ, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఎమ్మెల్యే అన్నారు. అవసరమైన సమయంలో తాను, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అండగా ఉంటారని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి యువ నాయకులు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పర్వతగిరి మండల అధ్యక్షురాలు సావిత్రి, సర్పంచ్ శంకర్, కల్లెడ పీఏసీఎస్ చైర్మన్ పిన్నింటి అనిల్‌రావు, చౌటపల్లి పీఏసీఎస్ చైర్మన్ అత్తి కుమారస్వామి, మాజీ జడ్పీటీసీ బానోత్ సింగులాల్, ఏనుమాముల మార్కెట్ డైరెక్టర్ గొడుగు బిక్షపతి, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మండల సీనియర్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బయ్యారంలో ఘనంగా గాంధీ జయంతి..

## -సత్యం,అహింసా మార్గంలో నడవాలని కాంగ్రెస్ శ్రేణుల పిలుపు.



**బయ్యారం,/అక్టోబర్ 2.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండల కేంద్రంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మా గాంధీ చేసిన త్యాగాలు చిరస్మరణీయమని, ఆయన చూపిన సత్యం,అహింస,శాంతి మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని నాయకులు పిలుపునిచ్చారు. గాంధీజీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,వివిధ గ్రామాల సర్పంచులు,ప్రజాసంఘాల నాయకులు, యువకులు,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని గాంధీజీ సేవలను స్మరించుకున్నారు.


# గాంధీ చూపిన మార్గం ఆదర్శనీయం

## మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్‌కుమార్





**స్టేషన్‌ఘన్‌పూర్/అక్టోబర్ 2 (జర్నలిస్ట్ వార్త):** మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలు నేటి సమాజానికి ఆదర్శనీయమని మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్‌కుమార్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపల్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి చైర్మన్ వినయ్‌కుమార్, కమిషనర్ బి.రాధాకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ఆయుధం పట్టకుండా అహింసా మార్గంలో బ్రిటిష్ పాలన నుంచి దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు గాంధీజీ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను ఆచరిస్తూ దేశ, రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నీల రాజమ్మ గట్టయ్య, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


# ఉపాధ్యాయుల సేవలు సమాజానికి మార్గదర్శకం

**మిర్యాలగూడ/ అక్టోబర్ 2 (జర్నలిస్ట్ వార్త):** మిర్యాలగూడ నియోజకవర్గంలో గురుపూజోత్సవ వేడుకలను అక్టోబర్ 1న ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎస్‌వీ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమానికి నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు చెందిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు హాజరయ్యారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఉపాధ్యాయులను సత్కరించారు.

ఈ సందర్భంగా పలువురు ఉత్తమ ఉపాధ్యాయులు, అధ్యాపకులకు శాలువాలు కప్పి జ్ఞాపికలు అందజేశారు. దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామంలోని కాకతీయ విద్యాలయ కరస్పాండెంట్ ఎస్.జె. అహ్మద్‌ను ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసి జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



# పోషకాహారమే ఆరోగ్య కుటుంబానికి పునాది

## సర్పంచ్ క్రాంతికుమార్, మున్సిపల్ చైర్మన్ వినయ్‌కుమార్



**స్టేషన్‌ఘన్‌పూర్/అక్టోబర్ 2 (జర్నలిస్ట్ వార్త):** పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన కుటుంబాన్ని నిర్మించుకోవచ్చని సర్పంచ్ క్రాంతికుమార్, మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్‌కుమార్ అన్నారు. పోషణ మాసం సందర్భంగా శుక్రవారం రాఘవపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం, స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపల్ కార్యాలయంలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. రాఘవపూర్‌లో అంగన్‌వాడీ టీచర్లు సీహెచ్.సుకన్య, జే.అనసూయ ఆధ్వర్యంలో పోషణ మాసం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ క్రాంతికుమార్ మాట్లాడుతూ తల్లులు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోషకాహారంపై కుటుంబాల్లో అవగాహన పెంచాలని అన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపల్ కార్యాలయంలోనూ అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్‌కుమార్ పాల్గొని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బి.రాధాకృష్ణ, వైస్‌చైర్మన్ నీల రాజమ్మగట్టయ్య, కౌన్సిలర్లు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాల సభ్యులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ ఆశయాలను అలవర్చుకోవాలి

## కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్



**కేసముద్రం/ అక్టోబర్ 2 (జర్నలిస్ట్ వార్త):** మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింసా మార్గాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్ కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ సూచించారు. కేసముద్రం మండలం మహమ్మద్‌పట్నం శివారులోని పాఠశాలలో శుక్రవారం గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి యాకాంతం గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో గాంధీజీ పాత్ర చిరస్మరణీయమన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ గాంధీజీ ఆశయాలను జీవితంలో ఆచరించాలని, దేశసేవకు పునాదులు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చిర్ర నరేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# దళిత మహిళా సర్పంచ్‌పై దాడిని ఖండించిన ఎమ్మార్పీఎస్



**స్టేషన్‌ఘన్‌పూర్/ అక్టోబర్ 2 (జర్నలిస్ట్ వార్త):** విశ్వనాథపురం గ్రామంలో దళిత మహిళా సర్పంచ్, పంచాయతీ సిబ్బంది, సర్పంచ్ కుటుంబ సభ్యులపై జరిగిన దాడిని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గాదె శ్రీధర్ మాదిగ, మండల అధ్యక్షుడు గుర్రం నవీన్ మాదిగ ఖండించారు. బెల్ట్‌షాపుల మూసివేతకు పంచాయతీ తీర్మానం అమలు చేస్తుండగా దాడి చేయడం దుర్మార్గమన్నారు. బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, నిష్పక్షపాతంగా విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గోవిందు ఇసాక్ మాదిగ, ఆరూరు శ్రీనివాస్ మాదిగ, నలిమెల నాగరాజు మాదిగ, మంద శ్రీనివాస్ మాదిగ, కలకోలా రాజశేఖర్ మాదిగ, అనిల్ మాదిగ, విశ్వనాథపురం ఉపసర్పంచ్ దాసి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.13 లక్షల లెక్క తేల్చాల్సిందే!




**వర్ధన్నపేట/అక్టోబర్ 2 (జర్నలిస్ట్ వార్త):** ఇల్లంద గ్రామపంచాయతీలో రూ.13 లక్షల నిధుల వినియోగంపై వివాదం ముదిరింది. నిధుల వినియోగంపై వార్డు సభ్యులు చేసిన ఫిర్యాదుతో అధికారులు చేపట్టిన తనిఖీల్లో సంబంధిత పనులకు తీర్మానాలు, ఎంబీ రికార్డులు, అంచనా వ్యయాలు అందుబాటులో లేవని గుర్తించినట్లు సమాచారం. దీంతో జిల్లా పంచాయతీ అధికారి కల్పన సర్పంచ్, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నిధులు ఏ పనులకు ఖర్చు చేశారు? సంబంధిత రికార్డులు ఎందుకు లేవు? నిబంధనలు పాటించారా? అనే అంశాలపై ఏడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. సంబంధితుల సమాధానం ఆధారంగా తదుపరి చర్యలు ఉండే అవకాశం ఉంది.

# జర్నలిస్టుల సమస్యలపై ఇకనైనా స్పందించాలి

## ఏళ్లుగా పెండింగ్‌లో పెట్టడం సరికాదు.. కలెక్టర్‌కు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నేతల వినతి

**హనుమకొండ/అక్టోబర్ 2 (జర్నలిస్ట్ వార్త):** ప్రజల సమస్యలను నిత్యం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే జర్నలిస్టుల సమస్యలను మాత్రం ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెట్టడం సరికాదని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) హనుమకొండ జిల్లా నాయకులు స్పష్టం చేశారు. జర్నలిస్టుల సమస్యలపై జిల్లా యంత్రాంగం తక్షణమే దృష్టి సారించి పరిష్కార చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌ను కలిసి జర్నలిస్టుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణం, తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా వృత్తిలో కొనసాగుతూ ప్రజల పక్షాన పనిచేస్తున్న జర్నలిస్టులకు






ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించి, అర్హత ఉన్న వారికి నిబంధనల ప్రకారం న్యాయం చేయాలని నాయకులు కోరారు. సమస్యలను కేవలం వినతిపత్రాలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు గడ్డం కేశమూర్తి, ప్రధాన కార్యదర్శి సాయిరాం, నాగరాజు, వెంకటరమణ, మధు మోహన్, రాజిరెడ్డి, అజిత్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# కలం పట్టిన చేతులకు.. సంక్షేమం ఎప్పుడు?

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి టీయూడబ్ల్యూజె(ఐజేయూ) డిమాండ్





**వరంగల్ బ్యూరో /అక్టోబర్ 2 (జర్నలిస్ట్ వార్త):** ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చే జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల విషయంలో ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని టీయూడబ్ల్యూజె(ఐజేయూ) జాతీయ కౌన్సిల్ సభ్యుడు సంగోజు రవి కోరారు. జాతీయ కమిటీ ఆదేశాలు, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గాంధీ జయంతిని పురస్కరించుకుని గురువారం గ్రేటర్ వరంగల్ కార్యాలయం ఎదుట గాంధీ విగ్రహానికి జర్నలిస్టులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రం సమర్పించారు. పనిచేస్తున్న పాత్రికేయుల డిమాండ్ దినంగా నిర్వహించిన కార్యక్రమంలో సంగోజు రవి మాట్లాడుతూ జర్నలిస్టులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా సంక్షేమ సదుపాయాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సదుపాయం అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, ఇళ్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇంకా పంపిణీ చేయకపోవడంపై ప్రజాప్రతినిధులు, అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

జిల్లా యూనియన్ అధ్యక్షుడు శ్రీరాం రాంచందర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి జాతీయ, రాష్ట్ర నాయకత్వాల పిలుపు మేరకు జిల్లా కమిటీ పనిచేస్తోందన్నారు. వరంగల్ జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టుల సమస్యలను సత్వరం పరిష్కరించి వారికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మట్టా దుర్గాప్రసాద్, కోశాధికారి కొదాటి గోపాలకృష్ణ, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు కందుల శ్రీధర్, ఉపాధ్యక్షులు జన్ను స్వామి, కూర్న వెంకటేశ్వర్లు, మహాదేవుని జగదీష్, సహాయ కార్యదర్శులు బొమ్మగాని సతీష్, చింతనూరి రాజు, బాధావత్ బాలాజీ, కార్యవర్గ సభ్యులు హుస్సేన్ పాషా, అక్రమ్, బాబర్, దేసు లక్ష్మణ్, కందుల శ్రీనివాస్, గాదె రవి, శీలం రమేష్, సీనియర్ జర్నలిస్టు పెరుమాండ్ల మధు తదితరులు పాల్గొన్నారు.

# హాజరు రికార్డులు పరిశీలించకుండా కథనం?

## సీతానగరం పాఠశాలపై ఎంఈఓ శ్రీనివాస్ స్పష్టీకరణ









**హసన్‌పర్తి/ అక్టోబర్ 2 (జర్నలిస్ట్ వార్త):** హసన్‌పర్తి మండలం సీతానగరంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయులు అందుబాటులో లేరంటూ ప్రచురితమైన గురువుల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు కథనంపై ఎంఈఓ ఏ. శ్రీనివాస్ స్పష్టీకరణ ఇచ్చారు. కథనంలోని అంశాలు వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా లేవని తెలిపారు. అక్టోబరు 1న పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు ఉదయం 9 గంటలలోపే హాజరైనట్లు ఎఫ్ఆర్ఎస్ ఆన్‌లైన్ హాజరు రికార్డులు స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఉదయం 9.05 గంటలకు అసెంబ్లీ నిర్వహించి, అనంతరం షెడ్యూల్ ప్రకారం తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. అధికారిక హాజరు రికార్డులు, వాస్తవ పరిస్థితులను పరిశీలించకుండానే కథనం ప్రచురితమైందని ఎంఈఓ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, ఉపాధ్యాయులపై అపోహలు కలిగించే అవకాశం ఉన్నందున వార్తల ప్రచురణకు ముందు సంబంధిత రికార్డులు, వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని సూచించారు. మండలంలోని ఏ పాఠశాలలోనైనా ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోతే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎంఈఓ ఏ. శ్రీనివాస్ స్పష్టం చేశారు.

# 375 పనులతో వేలేరుకు కొత్త రూపు

## ఉపాధి కల్పనకు పెద్దపీట.. సర్పంచ్ బిల్లా యాదగిరి

**వేలేరు/అక్టోబర్ 2 (జర్నలిస్ట్ వార్త):** గ్రామాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న వి.బి.జి. రామ్‌జీ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటూ వేలేరు గ్రామంలో 375 అభివృద్ధి పనులను గుర్తించినట్లు సర్పంచ్ బిల్లా యాదగిరి తెలిపారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఆయన అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభకు సుమారు 600 మంది గ్రామస్థులు హాజరయ్యారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మహిళా సంఘాల భవనాలు, అంగన్‌వాడీ భవనాలు తదితర మౌలిక వసతుల పనులతోపాటు వ్యక్తిగత, సామూహిక పనులను చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించినట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామీణ కూలీలకు స్థానికంగానే ఉపాధి కల్పించడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం కింద కొత్త జాబ్‌కార్డుల కోసం పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చినట్లు ఏపీవో విజయ తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి అర్హులకు జాబ్‌కార్డులు మంజూరు చేస్తామని చెప్పారు. వి.బి.జి. రామ్‌జీ పథకం ద్వారా అందుతున్న అవకాశాలను గ్రామ



ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ బిల్లా యాదగిరి కోరారు. గ్రామసభలో ఉపసర్పంచ్ శ్రీకర్, పంచాయతీ కార్యదర్శి విజయ, పీఆర్ఏఈ రూపవతి, ఏఓ కవిత, పోలీస్, విద్యుత్, రెవెన్యూ, విద్య, వైద్య, పశు సంవర్ధక, స్త్రీ శిశు సంక్షేమ, బ్యాంకు శాఖల అధికారులు, వీవోలు, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# గ్రామాభివృద్ధే ధ్యేయంగా ముందుకు..

## పెండింగ్ సమస్యలకు పరిష్కారం చూపాలి: సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా

**ధర్మసాగర్/అక్టోబర్ 2 (జర్నలిస్ట్ వార్త)**

మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో గ్రామాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతామని సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా అన్నారు. శుక్రవారం గాంధీ జయంతిని పురస్కరించుకొని గ్రామపంచాయతీ కార్యాలయంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత శాఖల అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. గ్రామ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని,



చేపట్టాల్సిన పనులను గ్రామసభ దృష్టికి తీసుకొచ్చి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని సూచించారు. గ్రామంలో చేపట్టాల్సిన వి.బి.జి. రాంజీ పనులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై గ్రామసభలో విస్తృతంగా చర్చించారు. ప్రజల సమస్యలు పరిష్కరించడమే



గ్రామపంచాయతీ పాలకవర్గం ప్రధాన బాధ్యతని సర్పంచ్ స్పష్టం చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, పాలకవర్గ సభ్యులు, వివిధ శాఖలకు చెందిన ఏఈలు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వర్గీకరణ ఫలాలు పొందుతున్న విద్యార్థులు ఉద్యమంలో భాగస్వాములు కావాలి

## : మహేందర్ మాదిగ



**భువనగిరి/ అక్టోబర్ 2 (జర్నలిస్ట్ వార్త):** ఎస్సీ వర్గీకరణ ఫలాలు పొందుతున్న మాదిగ విద్యార్థులు జాతి భవిష్యత్తు కోసం ఉద్యమంలో భాగస్వాములు కావాలని ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ యాదాద్రి భువనగిరి జిల్లా ఇన్‌చార్జి టైగర్ బిర్రు మహేందర్ మాదిగ పిలుపునిచ్చారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి కూడా విద్యార్థులు గళమెత్తాలని కోరారు. అక్టోబరు 6న ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిర్వహించే ఎంఎస్ఎఫ్ ప్రతినిధుల జాతీయ సదస్సుకు జిల్లా నలుమూలల నుంచి విద్యార్థినీ, విద్యార్థులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. భువనగిరి పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవన్‌లో శుక్రవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, ఎంఎస్ఎఫ్ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ ఉద్యమంతో కలిసి ఎంఎస్ఎఫ్ అనేక పోరాటాలు చేసిందన్నారు. వర్గీకరణతో మాదిగ విద్యార్థులకు విద్యా అవకాశాలు పెరిగాయని, వాటిని పొందిన విద్యార్థులు జాతి భవిష్యత్తు కోసం ఎంఎస్ఎఫ్‌లో చేరాలని కోరారు. విద్యారంగ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో అన్ని వర్గాల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎంఎస్ఎఫ్ పోరాటాలు కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఓయూలో జరిగే జాతీయ సదస్సుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని ప్రతి గ్రామం, మండలం, నియోజకవర్గం, జిల్లా కేంద్రం నుంచి విద్యార్థులు పెద్దఎత్తున తరలివచ్చి సదస్సును విజయవంతం చేయాలని మహేందర్ మాదిగ కోరారు. ప్రజాపాలన, ప్రజాస్వామ్యబద్ధ పాలన అని చెబుతున్న ప్రభుత్వం సదస్సుకు ఎలాంటి ఆటంకాలు కల్పించకుండా సహకరిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో దుబ్బ రామకృష్ణ మాదిగ, నల్ల చంద్రస్వామి మాదిగ, మంద శంకర్ మాదిగ, సందేల శ్రీనివాస్ మాదిగ, ఇటుకల దేవేందర్ మాదిగ, దండోరా మల్లేష్ మాదిగ, బోయ లింగస్వామి మాదిగ, నల్ల స్వామి మాదిగ, అందే సాయికృష్ణ మాదిగతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం చొరవ చూపాలి



**తల్లాడ/ అక్టోబర్ 2 (జర్నలిస్ట్ వార్త):**

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చొరవ చూపాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) తల్లాడ మండల కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఐజేయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గాంధీ జయంతి సందర్భంగా స్థానిక గాంధీ విగ్రహానికి పూలమాల వేసి, జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని మండల అధ్యక్షుడు ఎండి బహుదూర్ కోరారు. పరిమితులు లేని ఆరోగ్య కార్డులు, పెండింగ్ అక్రిడిటేషన్ కార్డుల మంజూరు, జర్నలిస్టుల రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడి జన్మదిన వేడుకలు. అనంతరం ప్రెస్‌క్లబ్‌లో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఏనుగు వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఎండి బహుదూర్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాసరి శ్రీనివాసరావు, గొడ్ల బాబురావు, దేవళ్ల ఉపేంద్ర, ఇసనపల్లి శ్రీనివాసరావు, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, నారపోగు ప్రసాద్, గొడ్ల నరసింహారావు, గొల్లమందల ప్రేమ్‌కుమార్, కాంపాటి రవి, కొత్తపల్లి విజయ్, రేగళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.




# వీరన్న నాయక్‌కు కాంగ్రెస్ నేతల సత్కారం



**కేసముద్రం/అక్టోబర్ 2 (జర్నలిస్ట్ వార్త):** కేసముద్రం మండల కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ నూతన మండల అధ్యక్షుడిగా నియమితులైన బానోత్ వీరన్న నాయక్‌ను కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీత వెంకన్న, పీసీసీ సభ్యుడు గూగులోత్ దసురు నాయక్ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. వీరన్న నాయక్ నాయకత్వంలో ఎస్టీ సెల్ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ ఎండి ఆయూబ్‌ఖాన్, కౌన్సిలర్ ధారావత్ కిషోర్ నాయక్, బానోత్ భద్య, రాంబాబు, ఓలం రాజు, మాజీ ఉపసర్పంచ్ ఎండి రఫీ, పార్వతి, శ్రీరామ్ కిరణ్, ముజ్జు షేక్, ఎండి రషీద్‌ఖాన్, ఎండి రియాజ్‌ఖాన్, వార్డు సభ్యులు మంగలాల్, ప్రభాకర్, ప్రభురాణి, తుంపిల్లా ఎంకన్న, వాంకుడోత్ రాజా, రాజేష్, రాపోలు శ్రీనివాస్, బానోత్ వీరన్న, బిచ్చ నాయక్, యాకూబ్, ఉప్పునుంతల శ్రీను, తరాల సుధాకర్, సుమన్ నాయక్, తోట సుధాకర్, రవి తదితరులు పాల్గొన్నారు.



## పంచాయతీని సొంత ఇల్లుగా భావించి విద్యుత్ పొదుపు చేస్తున్న పౌరులకు సత్కారం.



**బయ్యారం/అక్టోబర్ 2(జర్నలిస్ట్ వార్త):** బయ్యారం మండలం కొత్తపేట పంచాయతీలో రోజూ ఉదయాన్నే వీధిలైట్ల మెయిన్ స్విచ్‌లను ఆఫ్ చేస్తూ విద్యుత్ పొదుపుకు సహకరిస్తున్న గ్రామస్థులు బాపనపల్లి ప్రసాద్,కంచర్ల వెంకటేశ్వర్లు,నిమ్మల మల్లికార్జున్‌లను గంధంపల్లి కొత్తపేట సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్,ఉపసర్పంచ్ రావి వీరభద్ర రావు శాలువాలతో ఘనంగా సన్మానించారు.పంచాయతీని సొంత ఇల్లుగా భావించి కరెంట్ ఆదా చేస్తున్న వారి సేవలు అభినందనీయమని,గ్రామాభివృద్ధిలో ప్రజల సహకారం ఎంతో ముఖ్యమని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

### ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్




**మహబూబాబాద్/అక్టోబర్ 2(జర్నలిస్ట్ వార్త):** స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ సూచించారు. మహబూబాబాద్ నియోజకవర్గ పరిధిలోని 100 మంది మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. పలువురు లబ్ధిదారులకు స్టోన్ కటింగ్ మిషన్లు, జనరేటర్లు, కాటమయ్య కిట్లను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. అందిన పరికరాలను వినియోగించుకుని స్వయం ఉపాధి పొందుతూ కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గూగులోత్ జ్యోతి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి నాగలక్ష్మి, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, ముస్లిం, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## గాంధీజీ బాటే.. స్వేచ్ఛతకు బాట

### సత్యం, అహింసతోపాటు పరిశుభ్రతను ఆచరించాలి.

### మున్సిపల్ చైర్ పర్సన్ జ్యోతి రమేష్ నాయక్




**మహబూబాబాద్/అక్టోబర్ 2(జర్నలిస్ట్ వార్త):**మహాత్మా గాంధీజీ ఆశయాలను ఆచరించడమే ఆయనకు నిజమైన నివాళి అని మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎం.వినోద్‌కుమార్‌తో కలిసి గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, తడిపొడి చెత్తను వేర్వేరుగా అందిస్తూ పట్టణ పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నీరుటి లక్ష్మీనారాయణ, బొల్లు రాజు, సాల్వాయి దిలీప్, బానోత్ పార్వతి భాస్కర్, ధూపాటి స్పందన వినయ్, నిమ్మల మాధవి శ్రీనివాస్, లక్ష్మి, మున్సిపల్ మేనేజర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు, ఆర్పీలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అక్టోబరు 13 నాటికి బంగాళాఖాతంలో అల్పపీడనం..

### వాయుగుండంగా మారే చాన్స్



**అక్టోబర్ 2 (జర్నలిస్ట్ వార్త):**
నైరుతి రుతుపవనాల సీజన్‌లో తీవ్ర వర్షపాత లోటుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆంధ్రప్రదేశ్‌కు వాతావరణానికి సంబంధించిన మరో కీలక అప్‌డేట్ వచ్చింది. బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుందని, ఇది వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ శుక్రవారం వెల్లడించింది. దీని కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపింది.సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం, అక్టోబర్ 12వ తేదీన ఉత్తర అండమాన్ సముద్రంపై ఉపరితల ఆవర్తనం ఏర్పడనుంది. దీని ప్రభావంతో అక్టోబర్ 13 నాటికి అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయి. ఈ అల్పపీడనం పశ్చిమ, వాయవ్య దిశగా ప్రయాణిస్తూ మరింత బలపడనుంది. అక్టోబర్ 15 నాటికి ఇది దక్షిణ, మధ్య బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో వాయుగుండంగా మారవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. రానున్న రోజుల్లో దీని గమనం, తీవ్రతపై మరింత స్పష్టత వస్తుందని, వాతావరణ పరిస్థితులను బట్టి మార్పులు ఉండవచ్చని పేర్కొన్నారు.కాగా, ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలంలో (జూన్ 1 – సెప్టెంబర్ 30) రాష్ట్రంలో సాధారణం కంటే చాలా తక్కువ వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో సగటున 589.7 మిల్లీమీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా, కేవలం 383.6 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 34.9 శాతం వర్షపాత లోటు ఏర్పడింది. ఈ నేపథ్యంలో బంగాళాఖాతంలో ఏర్పడనున్న ఈ వాతావరణ వ్యవస్థ ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయా లేదా అనే అంశంపై ఆసక్తి నెలకొంది.

# గాంధీ ఆశయాలే ఆచరణకు దిక్సూచి

### మండల అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్యగౌడ్



**కేసముద్రం/అక్టోబర్ 2 (జర్నలిస్ట్ వార్త):**
మహాత్మా గాంధీజీ చూపిన సత్యం, అహింస, సేవా మార్గాలను నేటి తరాలు ఆచరించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని కేసముద్రం మండల కేంద్రంలోని గాంధీ సెంటర్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం వేడుకలు నిర్వహించారు. గాంధీజీ విగ్రహానికి మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, సమ్మయ్యగౌడ్‌తో పాటు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
ఈ సందర్భంగా సమ్మయ్యగౌడ్ మాట్లాడుతూ గాంధీజీ దృష్టిలో రాజకీయాలు పదవులు, అధికారం కోసం కాకుండా ప్రజాసేవకు సాధనమన్నారు. సమాజంలోని చివరి వరుసలో ఉన్న పేదవాడి కన్నీరు తుడవడమే నిజమైన ప్రజాసేవ అని ఆయన ఆచరించి చూపారని పేర్కొన్నారు.మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యమే గాంధీజీ స్వప్నమని అన్నారు. గ్రామాలు స్వయం సమృద్ధి సాధించి అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారని తెలిపారు. స్థానిక సమస్యలను స్థానిక ప్రజల భాగస్వామ్యంతో పరిష్కరించుకోవాలన్న గాంధీజీ ఆలోచనలు నేటికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో గుగులోత్ దస్రునాయక్, అంబటి మహేందర్‌రెడ్డి, రావుల మురళీ, కౌన్సిలర్లు తరాల వీరేష్, కిషోర్‌నాయక్, భధ్యానాయక్, రాంబాబు, రడం వెంకన్న, రడం శ్రీనివాస్, బానోత్ లక్ష్మీబాలు, కొత్త ప్రభాకర్, ఆయూబ్‌ఖాన్, దామరకొండ ప్రవీణ్, సామల నర్సయ్య, ముదిగిరి సాంబయ్య, వోలం రమేష్, వోలం రాజు, వోలం మురళీ, మార్కెట్ డైరెక్టర్ యాదగిరి, మాజీ ఎంపీటీసీలు బాలు నాయక్, శ్రీనివాస్‌గౌడ్, ఎండీ రఫి తదితరులు పాల్గొన్నారు. వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# అనాథాశ్రమంలో అనూష జన్మదిన వేడుకలు

**ఖమ్మం/ అక్టోబర్ 2 (జర్నలిస్ట్ వార్త):**
పుట్టినరోజు వేడుకలను అనాథ పిల్లల మధ్య జరుపుకోవడం ద్వారా సేవా స్ఫూర్తిని చాటుకున్నారు అనూష. ఖమ్మం పట్టణ పరిధిలోని పెద్దతండాలో ఉన్న మెఫి అనాథాశ్రమంలో గురువారం ఆమె జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని సుమారు 60 మంది అనాథ, మానసిక వికలాంగులైన పిల్లలకు దుస్తులు, నిత్యావసర సరుకులు అందజేయడంతో పాటు అన్నదానం చేశారు.కార్యక్రమంలో అనూష భర్త సందీప్, వారి పిల్లలు, అన్నయ్య, వదిన, అక్క, బావ, తల్లిదండ్రులు, అత్త, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెఫి నిర్వాహకురాలు నల్లగట్టు ప్రమీల ప్రియాంక మాట్లాడుతూ అనూష ప్రతి ఏడాది



తన పుట్టినరోజును సేవా కార్యక్రమాలతో నిర్వహిస్తూ, తన స్నేహితులను సైతం భాగస్వాములను చేస్తున్నారని తెలిపారు. నిరుపేద విద్యార్థులకు నోట్‌బుక్స్, పాఠశాల బ్యాగులు పంపిణీ చేయడంతో



పాటు వృద్ధులకు అన్నదానం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. అనూష, ఆమె కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని భగవంతుడిని కోరుకుంటున్నామని తెలిపారు.

# గాంధీ మార్గమే దేశానికి దిక్సూచి

### ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ

**వర్ధన్నపేట/ అక్టోబర్ 2 (జర్నలిస్ట్ వార్త):**
మహాత్మా గాంధీజీ చూపిన సత్యం, అహింస మార్గాలను ఆచరించడమే ఆయనకు నిజమైన నివాళి అని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్ అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని వర్ధన్నపేట ఏరియా ఆసుపత్రిలో గురువారం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ పాత్ర చిరస్మరణీయమన్నారు. అహింస, సత్యంతో ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చి స్వాతంత్ర్య పోరాటాన్ని ప్రజా ఉద్యమంగా మలిచారని పేర్కొన్నారు. పేదలు, బలహీనవర్గాలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి



అండగా నిలవడం ద్వారా గాంధీజీ మానవతా విలువలను ఆచరించవచ్చన్నారు.అనంతరం దామోదర్ తన చిన్ననాటి స్నేహితుడు దీకొండ యుగేందర్ జన్మదినం సందర్భంగా నాయకులు, ప్రజల సమక్షంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ కొండేటి మహేందర్, ఎస్సీ సెల్ జిల్లా



ఉపాధ్యక్షుడు మల్లెపాక సమ్మయ్య, కౌన్సిలర్లు బెజ్జం పాపారావు, దేవేందర్, మహిళా నాయకురాలు లింగం రజితారెడ్డి, వివిధ డివిజన్ల అధ్యక్షులు, నాయకులు ఐత సుధాకర్, వెంకటనర్సు, కుమార్, బాబూలాల్, వెంకట్‌గౌడ్, సోహైల్, కొండేటి మధు, ఆసుపత్రి సిబ్బంది, కార్యకర్తలు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# ముంబైలో పోటాపోటీ నిరసనలు..

## సీజేపీకి వ్యతిరేకంగా 'జెన్ నెక్స్ట్' ఆందోళన

**సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తూ ముంబైలో కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళన**

**సీజేపీకి వ్యతిరేకంగా 'జెన్ నెక్స్ట్ ముంబై' గ్రూప్ కౌంటర్ నిరసన**

**పోటాపోటీ ప్రదర్శనలతో ముంబైలో ఉద్రిక్త వాతావరణం**

**సోషల్ మీడియాలోనూ ఇరువర్గాల మద్దతుదారుల మధ్య మాటల యుద్ధం**

**భారీగా మోహరించిన పోలీసులు, భద్రతా బలగాలు**



**అక్టోబర్ 2 (జర్నలిస్ట్ వార్త):**
ముంబైలో శుక్రవారం ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఓవైపు నిరసనలు చేపట్టగా, మరోవైపు ఆ పార్టీకి వ్యతిరేకంగా 'జెన్ నెక్స్ట్ ముంబై' బృందం కౌంటర్ ప్రదర్శన నిర్వహించింది. ఈ పోటాపోటీ ఆందోళనల కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.
గాంధీ జయంతి సందర్భంగా సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త నిరసనలకు సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పిలుపునిచ్చారు. ఈ క్రమంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద, ముంబైలోని శివాజీ పార్క్ పరిసర ప్రాంతాల్లో ఆందోళనలు జరిగాయి. తమ నిరసనకు ప్రజలు మద్దతు ప్రకటించాలని పార్టీ ప్రతినిధి సౌరవ్ దాస్ విజ్ఞప్తి చేశారు.
వీరికి ప్రతిగా జెన్ నెక్స్ట్ ముంబై సభ్యులు అంబేద్కర్ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఒక నిరసనకారుడు మాట్లాడుతూ, "అభిజీత్ దీప్కే వంటి వ్యక్తులు రాజ్యాంగాన్ని అస్థిరపరచాలని చూస్తున్నారు. కానీ రాజ్యాంగాన్ని ఎలా కాపాడుకోవాలో, ఎలా గౌరవించాలో మాకు తెలుసు. అందుకే మేం బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్నాం. కాక్రోచ్ జనతా పార్టీ వైఖరిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోం" అని స్పష్టం చేశారు.
ఈ పోటాపోటీ ప్రదర్శనల ప్రభావంతో సోషల్ మీడియాలోనూ ఇరు వర్గాల మద్దతుదారుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. కొందరు జెన్ నెక్స్ట్ మద్దతుదారులు సీజేపీ సభ్యులను 'దిమాగీ నక్సల్స్'గా అభివర్ణించగా, జెన్ నెక్స్ట్ నిరసనల వెనుక బీజేపీ హస్తం ఉందని సీజేపీ వర్గాలు ఆరోపించాయి. పరిస్థితి అదుపు తప్పకుండా పోలీసులు, భద్రతా బలగాలు భారీగా మోహరించాయి. ఓటర్ల జాబితా సవరణ అంశంపై ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా సీజేపీ చేస్తున్న ప్రచారం ఏ స్థాయిలో విభేదాలకు దారితీసిందో ఈ ఘటనలు అద్దం పడుతున్నాయి.

# ‘నా వైఫ్ మిస్సింగ్‘.. చాలాకాలం తర్వాత మళ్లీ జోడీగా వరుణ్ సందేశ్, శ్వేతా బసు




‘కొత్త బంగారు లోకం‘ చిత్రంతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న వరుణ్ సందేశ్, శ్వేతా బసు ప్రసాద్ జంట చాలా కాలం తర్వాత మళ్లీ తెరపైకి రాబోతోంది. వీరిద్దరూ ప్రధాన పాత్రల్లో ‘ఆహా‘ ఓటీటీ సమర్పిస్తున్న సరికొత్త ఒరిజినల్ సిరీస్ ‘నా వైఫ్ మిస్సింగ్‘. వినూత్నమైన కంటెంట్‌తో సబ్‌స్క్రైబర్లను నిరంతరం ఆకట్టుకుంటున్న ఆహా, ఈ సస్పెన్స్ థ్రిల్లర్‌తో మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. భార్య కనపడటం లేదంటూ ఒక భర్త పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఈ కథ మొదలవుతుంది. ఈ కేసులో నిజమేంటి అనే అంశం చుట్టూ కథనం సాగుతుందని తెలుస్తోంది. ఇటీవల ఆహా విడుదల చేసిన అప్‌డేట్‌లో “ప్రతి కేసుకు ఒక కథ ఉంటుంది, ఈ కేస్ లో నిజం ఏంటి?“ అనే క్యాప్షన్ ప్రేక్షకులలో క్యూరియాసిటీని మరింత పెంచింది. తన భార్య మిస్సయ్యిందంటూ వరుణ్ సందేశ్ కంప్లైంట్ ఇవ్వడం, దాని వెనుక ఉన్న రహస్యం ఏమిటనేది సిరీస్‌లో ఉత్కంఠభరితంగా చూపించనున్నారని సమాచారం.వరుణ్ సందేశ్, శ్వేతా బసు ప్రసాద్‌లది టాలీవుడ్‌లో ఒక సక్సెస్‌ఫుల్ పెయిర్. ‘కొత్త బంగారు లోకం‘ తర్వాత వీరిద్దరూ కలిసి నటిస్తున్న ప్రాజెక్ట్ ఇదే కావడంతో సిరీస్‌పై అంచనాలు సహజంగానే పెరిగాయి. చాలా ఏళ్ల తర్వాత ఈ జంట మళ్లీ కలిసి నటించడం ఈ ప్రాజెక్ట్‌కు ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది.ఈ సిరీస్‌ను తెలుగుతో పాటు తమిళ భాషల్లో కూడా ఒకేసారి అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆహా ప్రకటించింది. మిస్సింగ్ కేసు వెనుక ఉన్న మిస్టరీ ఏంటి? నిజంగానే శ్వేతా బసు పాత్ర అదృశ్యమైందా? లేక దీని వెనుక ఇంకేదైనా కుట్ర ఉందా? అనే ప్రశ్నలకు సమాధానం తెలియాలంటే సిరీస్ చూడాల్సిందే. త్వరలోనే ‘నా వైఫ్ మిస్సింగ్‘ స్ట్రీమింగ్ తేదీని అధికారికంగా ప్రకటిస్తామని ఆహా టీమ్ తెలిపింది.

# రజనీకాంత్ ‘జైలర్ 2‘ ట్రైలర్‌కు ముహూర్తం ఖరారు.. పండగకు ముందే రానున్న టైగర్!




సూపర్‌స్టార్ రజనీకాంత్ అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న ‘జైలర్ 2‘ సినిమాకు సంబంధించి కీలక అప్‌డేట్ వచ్చేసింది. ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ అధికారిక థియేట్రికల్ ట్రైలర్‌ను అక్టోబర్ 5, 2026న విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ అధికారికంగా ప్రకటించింది. బ్లాక్‌బస్టర్ విజయం సాధించిన ‘జైలర్‘కు సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రం అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో, కళానిధి మారన్ సమర్పణలో సన్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ఇప్పటికే యూట్యూబ్‌లో ఈ సినిమా పేరుతో అనేక ఫ్యాన్-మేడ్, కాన్సెప్ట్ ట్రైలర్లు చక్కర్లు కొడుతున్న నేపథ్యంలో, అక్టోబర్ 5న రాబోయేది అఫీషియల్ ట్రైలర్ అని మేకర్స్ స్పష్టతనిచ్చారు. ఈ చిత్రంలో రజనీకాంత్ మరోసారి తన ఐకానిక్ ‘టైగర్‘ ముత్తువేల్ పాండియన్ పాత్రలో కనిపించి ప్రేక్షకులను అలరించనున్నారు.ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ అందిస్తున్న సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఇప్పటికే విడుదలైన ‘హుకుమ్ రీలోడెడ్‘ థీమ్ సాంగ్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతూ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది.

తారాగణం పరంగా కూడా ఈ సీక్వెల్ మరింత భారీగా ఉండనుంది. ఎస్.జె. సూర్య, విద్యాబాలన్, మిథున్ చక్రవర్తి ముఖ్య పాత్రలు పోషిస్తుండగా, తొలి భాగంలో అదరగొట్టిన మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్‌లతో పాటు ఈసారి విజయ్ సేతుపతి కూడా ప్రత్యేక అతిథి పాత్రలో మెరవనున్నారు. దీంతో ‘జైలర్ 2‘పై సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.ఐ

# తెలుగులోకి ‘హనుమాన్ అంశ్’.. రిలీజ్ డేట్ వచ్చేసింది!




ఆధ్యాత్మిక కథాంశంతో తెరకెక్కిన ‘హనుమాన్ అంశ్’ సినిమా బాక్సాఫీస్ దగ్గర భారీ వసూళ్లు సాధిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే రూ.400 కోట్ల మార్క్‌ను దాటిన ఈ సినిమా.. ఎట్టకేలకు తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా తెలుగు వెర్షన్‌ను విడుదల చేయనున్నట్లు హోంబలే ఫిల్మ్స్ ప్రకటించింది.నిజానికి ఈ సినిమా తెలుగు వెర్షన్ సెప్టెంబర్ 18న విడుదల కావాల్సి ఉంది. దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌కు చెందిన ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ తెలుగు వెర్షన్‌ను సమర్పించనున్నట్లు తొలుత ప్రచారం జరిగింది. అయితే డీల్ కుదరకపోవడంతో త్రివిక్రమ్ ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నట్లు సమాచారం.

సెప్టెంబర్ 15న హైదరాబాద్‌లో తెలుగు టీజర్‌ను విడుదల చేసేందుకు ఏర్పాట్లు కూడా చేశారు. అయితే చివరి నిమిషంలో ఆ కార్యక్రమం రద్దయింది. ఇప్పుడు హోంబలే ఫిల్మ్స్ స్వయంగా తెలుగు విడుదల బాధ్యతలను తీసుకుంది.

కేవలం రూ.1.8 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కినట్లు చెబుతున్న ఈ సినిమా.. సెప్టెంబర్ 28 నాటికి భారత్‌లో రూ.300 కోట్లకు పైగా నెట్ వసూళ్లు సాధించింది. 52వ రోజుకు ఈ మార్క్‌ను అందుకుంది. ప్రపంచవ్యాప్తంగా రూ.400 కోట్లకు పైగా వసూళ్లు రావడంతో చిత్రబృందం ఆనందం వ్యక్తం చేస్తోంది.విశాల్ చతుర్వేది దర్శకత్వం వహించిన ఈ సినిమా.. నీమ్ కరోలి బాబా జీవిత ప్రేరణతో తెరకెక్కిన ఆధ్యాత్మిక కథ. లక్ష్మీ నారాయణ్ అనే వ్యక్తి ఆధ్యాత్మిక మార్గంలోకి వెళ్లి ప్రముఖ సాధువుగా ఎలా మారాడన్నదే కథ. నీమ్ కరోలి బాబా పాత్రలో శోభినవ్ సత్యా నటించారు. విహాన్ షెదెగే, పూర్ణిమ తివారీతో పాటు పలువురు కీలక పాత్రల్లో కనిపించారు.

# ‘రణబాలి’ పాత్ర వెనుక ముగ్గురు రాయలసీమ వీరులు..

## డైరెక్టర్ రాహుల్ ఆసక్తికర విషయాలు!



విజయ్ దేవరకొండ, రష్మిక జంటగా నటిస్తున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా ‘రణబాలి’పై ఆసక్తి పెరుగుతోంది. బ్రిటిషర్లకు వ్యతిరేకంగా పోరాడిన సింగనమల బొబ్బిలి రణబాలి అనే యోధుడి పాత్రలో విజయ్ కనిపించనున్నారు. దసరా కానుకగా అక్టోబరు 16న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో సినిమా మేకింగ్‌కు సంబంధించిన ఆసక్తికర విషయాలను చిత్ర బృందం వెల్లడిస్తోంది.

‘రణబాలి’ పాత్రను రాయలసీమకు చెందిన ముగ్గురు పాలెగాళ్ల వీరోచిత గాథల నుంచి స్ఫూర్తి పొంది తీర్చిదిద్దినట్లు దర్శకుడు రాహుల్ సాంకృత్యన్ తెలిపారు. బుడ్డా వెంగళ్‌రెడ్డి, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, గడేకల్ బొబ్బిలి నాగిరెడ్డి జీవితాలు ఇందులో కీలకంగా నిలిచాయని చెప్పారు.

ఈ ముగ్గురు వీరుల కథలు ఇప్పటికీ రాయలసీమలో పాటల రూపంలో ప్రచారంలో ఉన్నాయని రాహుల్ తెలిపారు. వారి జీవితాల్లోని వీరోచిత ఘటనలు, ప్రజల్లో ప్రచారంలో ఉన్న కథనాల నుంచి అంశాలను తీసుకుని ‘రణబాలి’ పాత్రను రూపొందించినట్లు వివరించారు. దీంతో విజయ్ పోషిస్తున్న పాత్ర వెనుక రాయలసీమ చరిత్ర, జానపద గాథల ప్రభావం ఉన్నట్లు తెలుస్తోంది.బ్రిటిషర్లకు వ్యతిరేకంగా పోరాడే యోధుడిగా విజయ్ దేవరకొండను ఈ సినిమాలో చూపించనున్నారు. రష్మిక కథానాయికగా నటిస్తోంది. పీరియాడికల్ నేపథ్యంతో తెరకెక్కిన ఈ యాక్షన్ డ్రామాను దసరా సందర్భంగా అక్టోబరు 16న థియేటర్లలో విడుదల చేయనున్నారు.



# లెజెండ్‌తో స్క్రీన్ పంచుకోబోతున్న భాగ్యశ్రీ..



సౌత్ సినిమా ఇండస్ట్రీలో వరుస అవకాశాలతో దూసుకెళ్తున్న అందాల భామ భాగ్యశ్రీ బోర్సే ప్రస్తుతం మలయాళంలోకి గ్రాండ్‌గా అడుగుపెడుతోంది. మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో, నేషనల్ అవార్డు గ్రహీత విష్ణు మోహన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్-ఇండియా యాక్షన్ థ్రిల్లర్ మూవీ ‘ఆపరేషన్ గంగా‘లో ఆమె నటిస్తోంది. తాజాగా మోహన్‌లాల్‌తో కలిసి దిగిన ఒక బ్యూటిఫుల్ పిక్‌ను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ఆమె పెట్టిన పోస్ట్ ప్రస్తుతం నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఆ విశేషాలు చూద్దాం..చారిత్రాత్మక రెస్క్యూ ఆపరేషన్ కథాంశం: రష్యా-ఉక్రెయిన్ యుద్ధ సమయంలో ఉక్రెయిన్‌లో చిక్కుకుపోయిన భారతీయ విద్యార్థులు మరియు పౌరులను సురక్షితంగా వెనక్కి తీసుకొచ్చేందుకు భారత ప్రభుత్వం చేపట్టిన చారిత్రాత్మక ‘ఆపరేషన్ గంగ‘ ఆధారంగా ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. ఇక దేశభక్తి మరియు ఉత్కంఠభరితమైన సన్నివేశాలతో సాగే ఈ కథపై ప్రేక్షకులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ‘శ్రీ గోకులం మూవీస్‘ బ్యానర్‌పై గోకులం గోపాలన్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.స్టార్ కాంబినేషన్‌తో క్రేజీ ప్రాజెక్ట్: ఈ చిత్రంలో మోహన్‌లాల్ సరసన భాగ్యశ్రీ బోర్సే నటిస్తుండగా, బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్, ఆదిల్ హుస్సేన్ మరియు పార్థిబన్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇక ఈ సినిమాకు శాశ్వత్ సచ్‌దేవ్ సంగీతం అందిస్తుండగా, సౌత్ కొరియన్ స్టంట్ డైరెక్టర్ ఓ సే-యెంగ్ యాక్షన్ సీక్వెన్స్‌లను కొరియోగ్రఫీ చేస్తున్నారు. మోహన్‌లాల్‌పై భాగ్యశ్రీ ప్రశంసల జల్లు: ఇటీవల ‘లెనిన్‘ సినిమాతో కెరీర్‌లో తొలి భారీ హిట్ అందుకున్న భాగ్యశ్రీ బోర్సే, ఈ సక్సెస్ జోష్‌లోనే మలయాళ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇస్తోంది. మోహన్‌లాల్‌తో కలిసి పనిచేస్తున్న అనుభూతిని పంచుకుంటూ సోషల్ మీడియాలో ఆయనతో ఉన్న పిక్‌ను షేర్ చేసింది. “ప్రియమైన మోహన్ లాల్ సార్, మీతో పని చేయడం నాకు ఎంతో గొప్ప అవకాశం.. ప్రతి రోజూ షూటింగ్‌లో మీ నుంచి చాలా విషయాలు నేర్చుకుంటున్నాను. మీరు నిజంగా అద్భుతమైన టాలెంట్ సార్“ అంటూ తనకున్న అభిమానాన్ని చాటుకుంది. ఫాన్స్ కూడా ఈ క్రేజీ కాంబో కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నామని కామెంట్లు పెడుతున్నారు. దిగ్గజ నటుడు మోహన్‌లాల్ పక్కన నటించే గోల్డెన్ ఛాన్స్ దక్కించుకోవడం భాగ్యశ్రీ కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలవనుంది. ‘ఆపరేషన్ గంగా‘ సినిమాతో ఆమె మలయాళంలోనూ తన సత్తా చాటడానికి సిద్ధమవుతోంది. లెనిన్ సక్సెస్ తర్వాత వస్తున్న ఈ పాన్-ఇండియా ప్రాజెక్ట్ భాగ్యశ్రీ రేంజ్‌ను మరింత పెంచడం ఖాయం.

# సమంతకు భారీ ఊరట..

## డీప్‌ఫేక్‌లపై బాంబే హైకోర్టు సీరియస్



సినీ నటి సమంతకు బాంబే హైకోర్టులో భారీ ఊరట లభించింది. డీప్ ఫేక్‌లు, ఎఐ సాంకేతికతను దుర్వినియోగం చేసే వారిపట్ల కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఇతరుల ఫోటోలనే మార్ఫింగ్ చేయడం తదితర చర్యలు ఇతరుల హక్కులను ఉల్లంఘించడం కిందకు వస్తుందని కోర్టు తెలిపింది. ఈ మేరకు సమంత పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం సమంతకు సంబంధించిన అనధికారిక కంటెంట్ తొలగించాలని ఆదేశించింది. కాగా.. సమంత వ్యక్తిత్వ హక్కులకు సంబంధించి బాంబే హైకోర్టులో పిటిషన్ వేసింది. ఎఐ ప్లాట్‌ఫామ్‌లు, ఈ కామర్స్ పోర్టల్స్, డిజిటల్ మీడియా సంస్థలలో తన పేరు, ఫొటోలు, తన వాయిస్‌ను అనధికారికంగా ఉపయోగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది. తన వ్యాపారం, గుడ్2విల్, ముంబైలో ఉన్నప్పటికీ చాలా వాణిజ్య కార్యకలాపాలు కోర్టు స్థానిక ప్రాదేశిక అధికార పరిధిని దాటి విస్తరించాయని సమంత తన పిటిషన్‌లో సమర్పించింది. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం సమంతకు సంబంధించిన అనధికారిక కంటెంట్‌ను తొలగించాలని కూడా కోర్టు ఆదేశించింది. సమంత పేరు, ఫోటోలు, గొంతు అనధికారికంగా ఉపయోగించకుండా నిరోధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసు తదుపరి విచారణ డిసెంబర్ 10వ తేదీకి వాయిదా వేసింది.